సీరియల్

# రాక్షసహేపు

వాణిశ్రీ

(గత సంచిక తరువాయి)

వారంరోజులపాటు మందుకొడుతూ మత్తులోనే వుండిపోయాడు. కొండ శిఖరంనుంచి అగాధంలోకి దొర్లిపోయినట్లయింది అతని పరిస్థితి.

బావమరది అవతారకృష్ణ యెంతో ఓదార్చాడు. కష్టాలు కలకాలం వుండవన్నాడు. బ్రిడ్జికూలిపోవడం సీరియస్ విషయమైనందున ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకోవలసి వచ్చిందనీ, ఈ బ్లాక్ లిస్టు తాత్కాలికమైందనీ, దర్యాప్తుచేస్తున్న రిటైర్డు సి.ఐ.ని మేనేజ్ చేద్దామనీ యెన్నో చెప్పాడు.

అయితే చిరంజీవిరావు మానసికంగా క్రుంగిపోయాడు. సంపాదించినదంతా తిరిగి అందులోనే ఇరుక్కుపోయింది. సొసైటీలో ధైర్యంగా తిరగడానికి సిగ్గుగా వుంది. ఇక ఆ టౌన్‌లో పనీపాటా లేకుండా తిని, తిరగాలి. అలా లేజీగా వుండడం అతని తత్వానికి విరుద్ధం.

"జరిగేది యేదో జరిగితీరుతుంది. ప్రస్తుతానికి నీ కంట్రాక్ట్సులో భాగం ఇవ్వు" అని అడిగాడు చిరంజీవిరావు.

అవతారకృష్ణ నిర్మొహమాటంగా చెప్పాడు.

"వద్దు బావా! లేనిపోని గొడవలు వస్తాయి. బ్లాక్

లిస్టులో ఉన్నవాడిని పార్ట్‌నరుగా చేర్చుకుంటే నా కంపెనీనిగూడా బ్లాక్ లిస్టులో చేర్చే ప్రమాదం వుంది. పరిస్థితులు అసలే బాగాలేవు. కావాలంటే డబ్బు ఇస్తాను.''

చిరంజీవిరావుకి కోపం ముంచుకొచ్చింది.

బ్రిడ్జి కాంట్రాక్టులో అతను తారకృష్ణ పార్ట్‌నర్. సైట్‌లో వుండి కట్టించినవాడూ అతనే. అధికారులతో లాలూచీపడి సిమెంట్ అంతా అమ్ముకున్నదీ వాడే!

ఇప్పుడు తనవరకు వచ్చేసరికి తప్పుకుంటున్నాడు. పేపర్ మీద యెక్కడా అతను పార్ట్‌నర్ అని లేనందున బైటపడ్డాడు. లేకపోతే వీడూ బ్లాక్ లిస్టులో చేరి పోయేవాడే!

నాందేడ్‌లో దివాలాతీసి బికారిలా తిరుగుతూ అప్పులవాళ్ళతో తన్నులు తింటుంటే, చెల్లెలు రాసిన లెటర్ చూసి కరిగిపోయి ఇక్కడికి తీసుకొచ్చి ఆదరించాడు. ఇంతటి వాడిని చేశాడు. ఇప్పుడు ఆపదలో వున్న తనకు సహాయం చెయ్యడానికి సందేహిస్తున్నాడు.

చిరంజీవిరావుకి అవన్నీ తలపుకి వచ్చి పిచ్చెక్కి పోయింది. ఇద్దరూ మాటా, మాటా అనుకున్నారు. రేపు ఆ దర్యాప్తులో కంట్రాక్టర్ దగ్గర యేదైనా డబ్బు వసూలు చెయ్యాల్సివస్తే నువ్వు సగం ఇవ్వాల్సి వస్తుందని చిరంజీవిరావు హెచ్చరించాడు. నాకేం పట్టిందని అతను తారకృష్ణ అన్నాడు. ఇవ్వకపోతే నీ అంతు తేలుస్తాననీ, చంపి పాతిపెడతాననీ చిరంజీవిరావు ప్రతిజ్ఞ చేశాడు.

బావా, బామ్మరుదులు బద్ధ విరోధులయ్యారు.

బహిరంగంగా తిట్టుకోసాగారు.

టౌన్‌లో హైసర్కిల్ వాళ్ళకి ఈ విషయాలన్నీ

తెలిసి నవ్వుతున్నారు.

"కాగల కార్యం గంధర్వులే తీర్చారు అంటారు చూడు అలా జరిగింది" అన్నాడు కిరణ్ నవ్వుతూ.

విజయ ఆనందపడింది.

# 20

బంగాళాఖాతంలో వాయుగుండం పడింది.

తీరాన్ని దాటింది.

కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి.

పెనుగాలులకు కరెంట్ స్తంభాలు మెలికలు తిరిగి పోయాయి.

జయపూర్‌లో కరెంట్ లేదు.

అంధకార బంధురంగా వుంది.

వీధుల్లోనే జనసంచారం లేదు.

అర్థరాత్రి పన్నెండు అయింది.

వాన విసురుగా ముఖానికి కొడుతోంది.

కిరణ్ నల్లటి జర్కిన్ వేసుకున్నాడు. నల్లటోపీ, నల్లటి రెయిన్ బూటు. అతను నడుస్తుంటే చప్పుడు కావడంలేదు. చీకట్లో నీడలా కదిలిపోతున్నాడు.

ఆ సమయంలో అతన్ని యెవరైనా చూసినా దెయ్యం అనుకుని హడిలిపోవాల్సిందే.

నది ప్రక్కనే ఫాతిమా బిల్డింగ్ దగ్గర ఆగాడు. నది ప్రహారీ గోడకు అనుకుని ప్రవహిస్తోంది.

ప్రహారీ గోడకు అక్కడక్కడా సిమెంట్‌తో పోత పోసిన కిటికీలు బిగించి వున్నాయి. ఆ డిజైన్స్‌లోనుంచి లోపల అంతా కనిపిస్తోంది.

వరండాలో అల్సేషన్ కుక్క పడుకుని వుంది.

వర్షం లేకపోతే లోపల అంతా తిరుగుతూ వుండేది.

వాన కురుస్తున్నందువల్ల అది వరండాలోనే వుండిపోవలసి వచ్చింది.

కిరణ్ షర్టు లోపలనుంచి గన్ తీశాడు. అందులో ట్రాంక్విలైజర్ బులెట్స్ వున్నాయి.

కుక్కకి గురిచూసి ట్రిగర్ నొక్కాడు.

సూటిగా తగిలింది.

"భౌ....భౌ...." అంది.

ఎలర్టుగా లేచి నిల్చుంది.

కాని యెంతోసేపు నిలబడలేకపోయింది. మత్తు మందు ప్రభావానికి లొంగి, పడిపోయింది.

కిరణ్ గోడ దూకాడు.

కుక్కని కాళ్ళు పట్టుకుని పైకి ఎత్తాడు. గోడదగ్గర వరకు తీసుకెళ్ళాడు.

గిరగిర తిప్పి బలంగా గోడ అవతలకి విసిరేశాడు.

'ధబ్'మని శబ్దం వచ్చింది.

'గుడ్ బై' అనుకున్నాడు.

కొద్ది క్షణాల్లో కుక్క తుది శ్వాస విడుస్తుంది నీళ్ళలోనే. నదిలో కళేబరం కొట్టుకుపోయి సముద్రంలో కలుస్తుంది.

కిరణ్ ఒక్కొక్క అడుగే వేసుకుంటూ బిల్డింగ్ చుట్టూ తిరిగాడు. తలుపులన్నీ మూసి వున్నాయి. కిటికీలు క్లోజ్ చేశారు. లోపలకు వెళ్ళడానికి దారి కనిపించడంలేదు.

డాబాపైన ఒక్కటే గది.

అదే అవతారకృష్ణ స్వర్గం.

డ్రైనేజీ గొట్టం ఒక్కటే కనిపించింది పైకి వెళ్ళే మార్గం. ప్రహరీగోడ ఎక్కి, గొట్టం పట్టుకుని ఎగప్రాకాడు. పైకి చేరుకున్నాడు. కిటికీలు తెరిచివున్నాయి.

షేడ్స్ వుండడంవల్ల యెంత జల్లు పడినా లోపలకు వర్షం పడదు. ఏ.సి.లో అలవాటుపడిన వాళ్ళకి కరెంట్ లేకపోయేసరికి కిటికీలన్నీ తెరిచి పడుకున్నారు.

తొంగి చూశాడు.

లోపల డ్రెస్సింగ్ టేబుల్ మీద బ్లూ కలర్ గ్లాస్ గల చిన్న కిరోసిన్ బెడ్ లాంప్ వెలుగుతోంది.

దోమ తెర లోపల ఫాతిమా, అవతారకృష్ణ నిద్ర పోతున్నారు. నడుము క్రింద భాగం కప్పుకున్నారు. పైన ఆచ్ఛాదనలేదు ఇద్దరికీ. ఆమె గుండెల్లో ముఖం పెట్టుకుని పడుకున్నాడు అతను.

కిరణ్ ఆలోచిస్తున్నాడు.

తలుపు కొడితే 'ఎవరు?' అని అడుగుతారు.

ఏం చెప్పాలి?

'మీ అమ్మాయికి సీరియస్‌గా వుందని చెప్పాలి!'

వాడు షాక్‌తిని మరో ఆలోచనలేకుండా తలుపు తెరుస్తాడు. వచ్చినవాడు పైకి ఎలా వచ్చాడనే అనుమానం రాదు.

తలుపు నెట్టాడు.

గమ్మత్తుగా తెరుచుకుంది.

లోపల బోల్టు పెట్టుకోవడం మరిచిపోయారేమో? లేక అలవాటులేదేమో? బైట భయంకరమైన కుక్క కాపలా కాస్తోంది. అడుగుపెడితే ప్రాణాలుతీస్తుందని ధైర్యం అయివుండొచ్చు.

లోపలకు ప్రవేశించి బోల్టువేశాడు.

బెడ్ దగ్గరకు వెళ్ళి తీక్షణంగా చూశాడు.

ఇద్దరూ గాఢనిద్రలో వున్నారు. వాతావరణం అంత హాయిగా వుంది. సమ్మర్ ఇంకా పూర్తిగా పోకముందే

తుఫాన్ వస్తే ప్రాణానికి తృప్తిగా వుంటుంది.

ఫాతిమా ముఖం అందంగా కనిపిస్తోంది.

ఆమె గుండెలు ఆకర్షణీయంగా వున్నాయి.

కొన్ని క్షణాలు వివశుడై చూస్తూ నిల్చున్నాడు. ఆమెను నగ్నంగా చూస్తే ఎలా వుంటుందో ఊహించుకున్నాడు. పాలరాతి వీనస్ శిల్పంలా వుంటుందనిపించింది.

ఆకాశం గట్టిగా వురిమింది.

అతను ఎలర్ట్ అయ్యాడు.

దోమతెర పైకి ఎత్తాడు. షర్టులోనుంచి క్లోరోఫాంలో తడిపిన కర్చీఫ్ తీసి ఆమె ముక్కు దగ్గర పెట్టాడు. ఆమె ఊపిరి చేతికి తగుల్తోంది.

ఒక్క నిముషం తర్వాత ఆమె బుగ్గమీద చెయ్యి వేశాడు. భుజం కదిపాడు. చలనంలేదు. మందు పని చేసిందని తెలుసుకున్నాడు.

సోఫాలో కూర్చుని రిలాక్స్ అయ్యాడు.

అవతారకృష్ణ అదృష్టవంతుడు. ఆఖరి రాత్రి గూడా ప్రియురాలి కౌగిలిలో సేదదీరి చస్తున్నాడు.

అతనికి నవ్వొచ్చింది.

వాచీ చూసుకున్నాడు.

ఒంటి గంటకు ఇరవై నిముషాలు తక్కువ.

కిరణ్ లేచి ఫ్రిజ్ తీశాడు. వాటర్ బాటిల్ చల్లగా లేదు మామూలుగా వుంది. కరెంట్ లేదని అప్పుడు గుర్తొచ్చింది. బాటిల్ ఎత్తి మంచినీళ్ళు తాగాడు.

అతను మనిషిని యెప్పుడూ చంపలేదు. ఇదే మొదటి సారి. అందుకే మెంటల్ గా ప్రిపేర్ అవుతున్నాడు.

విజయకోసం తనీ హత్య చేయాల్సి వచ్చింది.

ఇదొక్కటే కాదు. ఇంకా చేస్తాడు గూడా!

ఎన్ని చేసినా చట్టానికి పట్టుబడగూడదు. పోలీసు లకు యేమాత్రం అనుమానం రాకూడదు. అది తన జీవి తాశయం ఒకరకంగా ఎక్కడ పొరపాటు జరిగినా జీవితం నాశనం.

శత్రువులు చచ్చిన తర్వాత విజయ, తను హాయిగా జీవితాన్ని అనుభవించాలి. తనకు ఆ నమ్మకం వుంది. అందుకు తన చదువు, తెలివితేటలు, అనుభవం ఫణంగా పెట్టి సాధిస్తాడు.

కిరణ్ లేచి నిల్చున్నాడు.

లాంప్ వత్తి పెద్దది చేశాడు.

గదిలో వెలుతురు ఎక్కువైంది.

బెడ్ దగ్గరికి వెళ్ళాడు. వాళ్ళు కప్పుకున్న దుప్పటి లాగేశాడు. ఇద్దరూ నగ్నంగానే వున్నారు. ఫాతిమా పాలరాతి శిల్పంలాగే వుంది. ఆమె శరీరం కాంతులీనుతూ వుంది. రోజ్ ఫెర్ ఫ్యూమ్ ఆమె ఒంటినుంచి గుభా ళిస్తోంది.

అతడారక్కృష్ణగూడా కదల్లేదు. బాగా తాగివున్నా డేమో దున్నపోతులా నిద్రపోతున్నాడు. నగ్నంగా, నల్లగా కనిపిస్తున్న అతని శరీరం అసహ్యంగా కనిపిం చింది అతనికి. ఫాతిమా ప్రక్కన వీడు బంగారం ముద్ద దగ్గర బొగ్గు రాయిలా వున్నాడు. ఆమె ఎట్లా భరిస్తోందో వీడిని అనుకున్నాడు. డబ్బు మహిమ అనుకుని సమాధాన పరుచుకున్నాడు.

బూటుతో పొట్టమీద తన్నాడు.

వుహూఁ... చలనం లేదు అతనిలో.

పొట్టమీద కాలు పెట్టి నొక్కాడు గట్టిగా.

అప్పుడు మూలిగాడు.

"లేరా!....లే...." అన్నాడు కిరణ్.

అతను నెమ్మదిగా కళ్ళు తెరిచి చూశాడు.

ఎదురుగా నల్లటి డ్రెస్‌లో కనిపిస్తున్న కిరణ్‌ని చూసి భయపడ్డాడు. కళ్ళు నులుముకుని చూశాడు. తను నగ్నంగా వున్న సంగతి గుర్తుకొచ్చి కంగారుపడ్డాడు.

"ఎవరున్నువ్వు?" అన్నాడు తడారిపోతున్న గొంతుతో.

మంచం దిగబోతుంటే "డోంట్ మూవ్!" అన్నాడు కిరణ్. అతని చేతిలో గన్ గురిపెట్టబడివుంది.

"ఏం కావాలి నీకు?" హీనస్వరంతో అడిగాడు అవతారకృష్ణ.

"నీ ప్రాణం కావాలి."

నవ్వాడు కిరణ్.

"నన్ను చంపకు. నీకు యెంతకావాలంటే అంత డబ్బు ఇస్తాను."

కిరణ్ పకపక నవ్వాడు.

"ఎంత డబ్బుంది నీ దగ్గర?"

"పది లక్షలు వుంది."

"సరిగ్గా చెప్పు!"

"పాతిక లక్షలుంది."

"నో....నిజం చెప్పడంలేదు నువ్వు."

"కోటి ఉంది. కాని అదంతా డబ్బు రూపంలో లేదు. బంగారం, బిల్డింగ్‌లు, భూములు ఉన్నాయి."

"గుడ్ ఇప్పుడు నిజం చెప్పావు."

"చెప్పు నీకెంత కావాలో. నా ప్రాణాలు తియ్యకు. ప్లీజ్" అన్నాడు అవతారకృష్ణ వణికిపోతూ.

"నేను చెప్పినట్లు చెయ్యి."

"చేసా!"

"బెడ్ మీద నుంచి లేచి అక్కడ నేలమీద కూర్చో!"

అవతారకృష్ణ దుప్పటి ఒంటికి చుట్టుకోబోయాడు.

"నో....అలాగే వెళ్ళాలి. సిగ్గుపడుతున్నావా? ఎందుకు? పుట్టినప్పుడు బట్ట కట్టలేదు, పోయేటప్పుడు అది వెంటరాదు."

"నన్ను చంపుతావా?"

"చెప్పినట్లు చెయ్యి."

అతను సిగ్గుతో కుంచించుకుపోతూ బెడ్ దిగివెళ్ళి నేలమీద నిల్చున్నాడు.

"కూర్చో!" చెప్పాడు కిరణ్.

అతను కూర్చున్నాడు.

"ఇప్పుడు చెప్పు. సరిగ్గా ఇరవై ఏళ్ళ క్రితం సంగతి. ఆనందపురంలో నీ ఫ్రెండ్ జమీందారు బ్రహ్మాజీని డబ్బు అడగడానికి వెళ్ళావు. నీ వెంట నీ ఫ్రెండ్స్ ముగ్గురున్నారు. నువ్వు పదిలక్షలు అప్పు అడిగావు. హైదరాబాద్‌లో నువ్వు అప్పుడు స్టీల్ వ్యాపారం చేస్తున్నావు. బ్రహ్మాజీ ఏలూరు వెళ్ళి డబ్బు డ్రా చేసి నీకు ఇచ్చాడు. తిరిగి అంతా ఆనందపురం వస్తున్నారు. అప్పుడు ఏం జరిగింది?"

అవతారకృష్ణ నోరు తెరుచుకుని ఆశ్చర్యంతో వింటున్నాడు. ఎవరు ఇతను? ఇదంతా ఎలా తెలుసు?

కిరణ్ పాంటులోనుంచి కత్తి తీశాడు. పన్నెండు అంగుళాల పొడుగ్గా, తెల్లగా మెరుస్తోంది అది.

"చెప్పు!"

కత్తితో భుజంమీద గీశాడు సన్నగా.

కెవ్వుమన్నాడు అతను. కత్తితో గీసినచోట నెత్తురు కారింది.

"చంపక చెప్తాను."

"ఊఁ.... చెప్పు."

"అదంతా అడవి ప్రాంతం. దారిలో దొంగలు రాళ్లు అడ్డం పెట్టారు. కారు ఆగగానే దాడిచేశారు. బ్రహ్మాజీ చేతిలో ఉంది డబ్బున్న సూట్ కేసు. అది తీసుకో బోయారు. అతని భార్య మెడలో నగలు లాక్కొం టుంటే ఆమె ప్రతిఘటించింది. మేము ఇచ్చేయ్యమని చెప్తున్నా వినలేదు. అప్పుడు దొంగలు వాళ్ళని చంపి డబ్బు, నగలు దోచుకుని అడవిలోకి పారిపోయారు" చెప్పాడు అవతారకృష్ణ.

"ఇదంతా మీరు కల్పించిన కథ, ప్రచారంలో వున్న కథ. నాక్కావలసింది అది కాదు. నిజం కావాలి. చెప్పు"

కిరణ్ రెండో భుజంమీద లోతుగా చీరాడు.

బాధతో మూలిగాడు.

"నేను చెప్పిందంతా నిజమే."

"ఆ సమయంలో బ్రహ్మాజీగారి దివాన్ జోగారావు మీ కారులోనే ఉన్నాడు గుర్తుందా?"

అవతారకృష్ణ నోరు తెరిచాడు.

"ఆయన మా నాన్న! ఆయన నిజం చెప్పి చని పోయాడు తెలిసిందా?"

పకపక నవ్వాడు కిరణ్.

"ఇప్పుడు చెప్పు? ఎవరు ఎంత పంచుకున్నారు?"

"నేను ఐదులక్షలు తీసుకున్నాను. మిగిలిన ముగ్గురు ఐదు లక్షలు పంచుకున్నారు."

"గుడ్. బ్రహ్మాజీని, ఆయన భార్యని చంపినవాళ్ళు ఎవరు?"

"నేను కాదు."

"మరెవరు?"

"కాటిల్యరావు, రాజేంద్రకుమార్, జేమ్స్."

"వాళ్ళెక్కడున్నారు?"

"కాటిల్యరావు హోమ్ మంత్రి. మిగిలినవాళ్ళెక్కడో నాకు తెలియదు.

"అయితే నువ్వు చంపలేదంటావ్?"

"అవును."

"పోనీ వాళ్ళని చంపమని ఐడియా ఇచ్చావా?"

"లేదు. జేమ్స్‌గాడు ఇచ్చాడు."

"సరే ఇప్పుడు చెప్పు! నీకు శిక్ష ఏమి వెయ్యమంటావో? చట్టానికి చేతగాదు అసలు హంతకుల్ని శిక్షించడం. కాబట్టి చట్టాన్ని నా చేతిలోకి తీసుకుని చంపుతున్నాను. తప్పులేదు. భగవద్గీతలో ఏం చెప్పారు?"

"నన్ను చంపితే ఏం వస్తుంది? నేను తీసుకున్న ఐదు లక్షలకు పరిహారంగా పాతిక లక్షలు ఇస్తాను." అవతార కృష్ణ వణికిపోతూ అన్నాడు.

చల్లటి వాతావరణంలో కూడా అతనికి చెమటలు కారుతున్నాయి. చెమట నెత్తురు కలిసి అతని శరీరం మీద పాకుతున్నది.

"దుర్మార్గుడా? స్నేహితుడివని ఆదరించి పదిలక్షలు అప్పు ఇవ్వడానికి సిద్ధపడిన మంచి మనిషిని రాక్షసంగా చంపుతావా? నువ్వు మనిషివి కావు. పిశాచానివి. నీకు ఈ లోకంలో బ్రతికే హక్కు లేదు."

కిరణ్ కళ్ళు ఎర్రబడ్డాయి.

గురిచూసి గుండెలోకి కత్తి దించాడు.

అతను గిలగిల కొట్టుకున్నాడు. కబేళాలో తల తెగిన మేకలా తన్నుకున్నాడు. కాసేపటికి అతనిలో చలనం ఆగిపోయింది.

గది అంతా రక్తం చిమ్మింది.

కిరణ్ ఫాతిమా వంక చూశాడు.

ఆమె యే లోకంలో వున్నదో?

మెలకువ వచ్చిన తర్వాత యెంత అవస్థపడుతుందో!

కిరణ్ కత్తి లాగాడు. రక్తం తుడిచాడు.

ఒక్కసారి గదంతా కలయ చూశాడు తను ఏదైనా ఆధారం వదిలి పెడుతున్నానా అని. ఏమీ లేదని నిర్ధారణ చేసుకున్నాక తలుపుతీసి బైటికి వెళ్ళాడు.

పైపు పట్టుకుని దిగాడు. ప్రహారీ గోడ దూకాడు.

నల్ల కోటుతో బాటు, కత్తితోపాటు పెద్దరాయిని పెట్టి మూటలా కట్టాడు. శక్తికొద్దీ విసిరాడు. అది దూరంగా నదిలోకి వెళ్ళి పడింది.

నెమ్మదిగా రోడ్డుమీదకు వచ్చాడు.

కొంత దూరంలో తుమ్మచెట్టు కింద దాచిన కాన్వాస్ బూటు తొడుక్కుని మళ్ళీ బయల్దేరాడు. నది ఒడ్డునే చాలా దూరం నడిచాడు డామ్ సైట్ చేరుకున్నాడు. అక్కడే రేకుల షెడ్‌లో ఆని ఆఫీసు. వాచ్ మాన్ చలికి రగ్గు కప్పుకుని ముసుగు దీసుకుని నిద్రపోతున్నాడు. తను వెళ్ళడం, రావడం వాడు చూళ్ళేదు అని తృప్తి పడ్డాడు.

ఆఫీసు బీరువాలో వున్న మరో నల్లటి జర్కిన్ వేసుకున్నాడు.

"వాచ్ మాన్!...." అని గట్టిగా కేకపెట్టాడు.

అతను వులిక్కిపడి లేచాడు.

"సార్!" అన్నాడు నిద్రకళ్ళతోనే.

"కారు షెడ్ తాళంతియ్యి. ఇంటికి పోతాను. వాన తగ్గిందిలే" అన్నాడు కిరణ్.

"సార్!" అని వాచ్ మాన్ షెడ్ తాళం తీశాడు.

కిరణ్ కారులో కూర్చుని బైటకు తెచ్చాడు.

"జాగ్రత్త!...." అన్నాడు.

"టైమెంతయింది సార్?"

"పన్నెండు" అని కారు పోనిచ్చాడు.

ఫియట్ చీకట్లో మాసుకుపోయింది.

## 21

గాలికి బెడ్ లైటు ఆరిపోయింది.

కిరణ్, విజయను గట్టిగా హత్తుకున్నాడు.

"అవతారకృష్ణ అవతారం చాలించాడు విజయా!" ఆమె చెవిలో గుసగుసలాడుతున్నట్లు చెప్పాడు.

"ఐయామ్ వెరీ వెరీ హేపీ...." అని విజయ అతన్ని పాములా పెనవేసుకుంది.

అతనికి స్వర్గంలో తేలిపోతున్నట్లు అనుభూతి కలిగింది. అప్పటివరకు అనుభవించిన టెన్షన్ నుంచి రిలాక్స్ అయ్యాడు.

మర్నాడు ఉదయం కిరణ్ కి మెలకువ వచ్చేసరికి ఎనిమిది దాటింది.

విజయ తల దువ్వుకుంటూ కనిపించింది.

అతను కళ్ళు తెరవడం చూసి నవ్వింది.

"మీ ఫ్రెండ్ ని ఎవరో మర్డర్ చేశారట" అంది.

"ఎవరూ మా ఫ్రెండ్?" ప్రశ్నించాడు కిరణ్.

"కంట్రాక్టర్ ఫ్రెండ్ అవతారకృష్ణ."

"ఎవరు చెప్పారు?"

"పనిమనిషి."

"మై గాడ్" అని హడావుడిగా లేచి పనిమనిషిని పిలిచాడు.

"దుర్గా....దుర్గా....!"

"ఏంటయ్యగారూ!" అని వచ్చింది పనిమనిషి.

"అవతారకృష్ణని చంపేశారా?"

"అవునయ్యగారూ! అయన్ని ముండింట్లో యెవరో కత్తితో పొడిచేశారంట. ఊరంతా చెప్పుకుంటున్నారు" అంది దుర్గ.

"నువ్వు చూశావా?"

"అమ్మో నాకు భయం" అంది గుండెలమీద చేతులు వేసుకుని.

కిరణ్ ఫోన్ రిసీవర్ ఎత్తి డియస్పీకి రింగ్ చేశాడు.

"డియస్పీ సి.సి. ప్లీజ్."

"నేను కంట్రాక్టర్ కిరణ్‌ని మాట్లాడుతున్నా! డియస్పీగారున్నారా?"

"లేరు సార్! కంట్రాక్టర్ అవతారకృష్ణ మర్డర్ జరిగింది. అంతా అక్కడే వున్నారు. మీకు తెలీదా?"

"ఇప్పుడే తెలిసింది. నిజమేనా అని."

"నిజమే సార్!"

"ఎవరు చేశారు?"

"డిటెయిల్స్ తెలియదు సార్!"

"థాంక్యూ!" అని రిసీవర్ పెట్టేశాడు.

త్వరగా డ్రెస్ చేసుకుని కారులో ఫాతిమా ఇంటికి బయల్దేరాడు.

దూరంనుంచే జనం ప్రవాహంలా కనిపిస్తున్నారు. ఊళ్ళో జనమంతా అక్కడే వున్నట్లుగా వుంది.

పోలీసు జీపులు, గవర్నమెంట్ వెహికల్స్ కంట్రాక్టర్ల కార్లు అక్కడ బారులు తీరివున్నాయి.

పోలీసులు జనాన్ని అదుపుచెయ్యడానికి కష్టపడుతున్నారు.

పోలీసుల వలయాన్ని దాటుకుని డియస్పీ, ఇంజనీర్లు, కంట్రాక్టర్లు వున్న చోటుకి చేరుకున్నాడు కిరణ్.

డియస్పీ బిజీగా వున్నాడు. పోలీస్ అధికారులతో మంతనాలు సాగిస్తున్నాడు.

కంట్రాక్టర్ సుబ్బిరెడ్డిని అడిగాడు కిరణ్.

"ఎలా జరిగింది?"

అతను పెదవి విరిచాడు.

"ఏమీ అర్థం కావడంలేదు కిరణ్. ఇంత బతుకు బతికి ముండ ఇంట్లో చావడం ఏమిటి? ఛీ....పరువు తక్కువ!" అన్నాడు.

సుబ్బిరెడ్డికి, అవతారకృష్ణకి చుక్కెదురు.

కిరణ్ కామెంట్ చెయ్యలేదు.

"ఎవరు చంపివుంటారు?" ప్రశ్నించాడు కిరణ్.

"ఎక్కడా అనకు. వాళ్ళ బావే చేయించాడని పుకారు పుట్టింది" నెమ్మదిగా చెవులో అన్నాడు సుబ్బిరెడ్డి

"ఈజిట్! ఐ కాంట్ బిలీవ్. చెల్లెల్ని ముండమోయిస్తాడా ఎవరైనా?" ఆశ్చర్యంగా అన్నాడు కిరణ్.

"బ్రిడ్జి కూలిపోవడంతో చిరంజీవిరావుకి పిచ్చెక్కింది ఏమైనా చేయిస్తాడు. డబ్బు, హోదా దగ్గర చెల్లెలేమిటి? తమ్ముడేమిటి" అన్నాడు సుబ్బిరెడ్డి.

కిరణ్ మరికాస్త ముందుకు వెళ్ళి కంట్రాక్టర్ మునెయ్యకు విష్ చేశాడు.

"ఎలా జరిగింది ఈ ఘోరం?" అడిగాడు కిరణ్.

"ఫాతిమా తమ్ముడే చంపాడని అనుకుంటున్నారు."

"ఎవరు ఫాతిమా అంటే?"

"నువ్వెక్కడున్నావయ్యా మగడా! ఫాతిమా అంటే మన అవతారకృష్ణ ప్రియురాలు."

"ఓహోహో నాకు పేరు తెలియదులెండి."

"వాడికి, వీడికీ యేవో గొడవలయ్యాయట."

"ఇల్లీగల్ కనెక్షన్స్‌తో ఇదే గొడవండి" అన్నాడు కిరణ్.

అవతారకృష్ణ డెడ్‌బాడీని పోస్ట్‌మార్టమ్ చెయ్యడానికి అంబులెన్స్‌లో ఎక్కించారు పోలీసులు.

అతని భార్య, కూతురు ఏడుస్తున్నారు వరండాలో.

తర్వాత ఎక్కడి వాళ్ళు అక్కడ చెదిరిపోయారు.

రెండు రోజులు పోయాక క్లబ్‌లో తీరికగా కూర్చున్న డియస్పీ దగ్గరికి చేరాడు కిరణ్.

"కమాన్ మిస్టర్ కిరణ్!" అని ఛైర్ చూపించాడు.

కిరణ్ కూర్చుని "ఏమైనా తెలిసిందా మావాడి మర్డర్ కేసులో" అన్నాడు

"ఇంత కన్‌ఫ్యూజ్‌డ్ కేసు నాకెక్కడా తగల్లేదు కిరణ్!" తలపట్టుకున్నాడు డియస్పీ.

"ఏం?"

"అతన్ని పొడిచిన వెపన్ దొరకలేదు. గమ్మత్తు ఏమిటంటే ఇరవై నాలుగు గంటలూ కాపలా కాసే అల్సేషన్ కుక్క మాయమైపోయింది. వాడి ముండలేమో! అదే ఫాతిమా! నాకేం తెలీదు మొర్రో అంటుంది.

అతన్ని చంపుకోవాల్సిన ఖర్మ నాకెందుకు? నేనేం కావాలంటే అది తెచ్చి ఇచ్చేవాడు అంటుంది. ఒక రకంగా దాని పాయింట్ కరెక్టే."

"పోలీస్ డాగ్స్‌ని తెప్పించలేదా?" ప్రశ్నించాడు కిరణ్.

"నో యూజ్. తెల్లవార్లూ వాన కురుస్తూనే వుంది. కుక్క ఎక్కడని వాసనపడుతుంది. పాదాల ముద్రలు గూడా చెరిగిపోయాయి."

"ఐ.సీ."

"మరి ఎవరనుకుంటున్నారు? ఎవరికి అవసరం అతన్ని చంపాలని?"

"అదే తీవ్రంగా ఆలోచిస్తున్నాం. లాభం లేనిదే ఎవడూ మర్డర్ చెయ్యడు. లేదా కక్షకట్టి చేస్తాడు."

"యూ ఆర్ సెంట్ పర్సెంట్ కరెక్ట్" అన్నాడు కిరణ్.

"అనుమానం చాలామందిమీద వుంది. ఫాతిమా తమ్ముడు యూసఫ్ అని ఒకడున్నాడు. వాడిని చావ బాదినా నాకేం తెలియదు అంటున్నాడు. హెల్తాఫీసరు తమ్ముడు ఒకడున్నాడు."

"హెల్తు ఆఫీసర్ తమ్ముడా?" కిరణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

"యస్. వాడు అవతారకృష్ణ కూతుర్ని లౌ చేస్తున్నాడట. అది గొడవైంది. ఒకసారి ఆ కుర్రాడ్ని పార్కులో కొట్టించాడు."

"ఆ మాత్రానికే మర్డర్ చేస్తాడా?"

"ఏవుంది కిరణ్! కుర్రాడు. వుడుకు నెత్తురు. పైగా వాళ్ళ కులాలు ఒకటికాదు గూడా. తండ్రిని చంపితే

కూతురు స్వేచ్ఛగా తనను పెళ్ళిచేసుకుంటుందని పిచ్చి ఆలోచనతో చేసివుంటాడు. ఏం చెప్పలేం."

కిరణ్ నిట్టూర్చాడు బాధగా.

"ఇంకొక పెద్ద చేపవుంది తెలుసా?"

కిరణ్ ఉలిక్కిపడ్డాడు.

"పెద్ద చేపా?"

"యస్. చిరంజీవిరావు. ఆయన బావగారే" నవ్వాడు డియస్పీ.

"మై గాడ్" అన్నాడు కిరణ్.

"ఇంత న్యూసెన్స్ మర్డర్ కేసు నా సర్వీస్‌లో చూశ్శేదనుకో. మతిపోతోంది. ఎవడ్నీ గట్టిగా అడగడానికి ఏ ఆధారం దొరకడంలేదు" అసంతృప్తి వ్యక్తం చేశాడు డియస్పీ.

"ఒక గేమ్ టెన్నిస్ ఆడదాం, వస్తారా?" పిలిచాడు కిరణ్.

"పదండి" అని చైర్‌లోనుంచి లేచాడు డియస్పీ.

రెండు నెలలు మెటల్ కాంట్రాక్ట్ చేశాడు కిరణ్. రావలసిన బిల్స్ పాస్ అయ్యాయి. చెక్‌లు అందు కున్నాడు. కొత్తగా వేటికీ టెండర్లు వెయ్యలేదు.

ఆనందపురం వెళ్ళి పదిహేను రోజులు వుండివచ్చారు. విజయ, కిరణ్ హేపీగా వుండడం చూసి భవానీదేవి ఆనందించింది. వాళ్ళవెంట జయపూర్ వచ్చి నెలరోజులు వున్నది.

ఒకరోజు అతనికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోవింద రాజులు ట్రాన్స్‌ఫర్ అయ్యాడని తెలిసి ఇంటికి వెళ్ళాడు. పరామర్శలు అయ్యాక కిరణ్ చెప్పాడు.

"సార్! రూల్స్ ప్రకారం మెటల్ తోలుతుంటే

నాకేం మిగులు కనిపించడంలేదు."

గోవిందరాజులు నవ్వాడు.

"ఇండియాలో రూల్ ప్రకారం ఏ వ్యాపారం చేసినా లాభం వుండదు. ఇళ్ళు, వాకిళ్ళు అమ్మి నెత్తిన గుడ్డేసుకుని పోవాలి."

"నాకెందుకో లాలూచీ వ్యవహారాలు నచ్చడంలేదు."

"ఏం చేద్దామనుకుంటున్నావ్?"

"మద్రాసో, హైదరాబాదో వెళ్ళి ఏదైనా ఇండస్ట్రీ స్టార్ట్ చేద్దామనుకుంటున్నాను."

"ఐడియా మంచిదే. అక్కడా నీకు ప్రాబ్లమ్స్ తప్పవు."

"లెట్ మీ ట్రై సార్! ఇక్కడ మీరుంటే నాకు ధైర్యంగా వుండేది. మీరూ వెళ్ళిపోతున్నారు."

"నాదే వుందిలే."

"అలా అనకండి మీరు ఇక్కడున్నారనే వచ్చాను. ఈ బిజినెస్‌లో అ, ఆలు నేర్పింది మీరే."

గోవిందరాజులు మొహమాటంగా నవ్వాడు.

"లారీలు అమ్మేదామనుకుంటున్నాను సార్! ఎవరికైనా కావాలంటే చెప్పండి" అన్నాడు కిరణ్.

"అలాగా! సుబ్బిరెడ్డికి అవసరం అన్నాడు. అతనిప్పుడు హైదరాబాద్ నుంచి హైవేకి తెచ్చి నడుపుతున్నాడు! కనుక్కుందాం" అని సుబ్బిరెడ్డికి ఫోన్ చేశాడు.

కాసేపటిలో సుబ్బిరెడ్డి అక్కడికి చేరుకున్నాడు.

డీల్ ఫైనలైజ్ అయింది.

సుబ్బిరెడ్డి చెక్ రాసిచ్చాడు.

కిరణ్ ఆఫీసులో కూర్చుని చాలా రాత్రివరకు

ఎకౌంట్స్ చూశాడు. అన్ని ఖర్చులు పోను లక్ష లాభం మిగిలింది.

'మన క్రెడిట్ లో ఒక మర్డర్, మరొక లక్ష' అనుకుని నవ్వుకున్నాడు.

క్లబ్ లో తనకి రెండు లక్షలు నష్టం వచ్చిందనీ, అందుకే బిజినెస్ మానేసి వెళ్ళిపోతున్నానని కనిపించిన వాళ్ళందరికీ చెప్పాడు.

ఆఖరి రోజున కిరణ్ కి క్లబ్ లో వీడ్కోలు పార్టీ ఇచ్చారు. కిరణ్ వంటి మంచి మిత్రుడు వెళ్ళిపోవడం అందరికీ బాధగా వుందని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు డియస్పీతో సహా.

ఆ మర్నాడు కిరణ్ క్లబ్ మెంబర్స్ కి స్కాచ్ విస్కీతో గ్రాండ్ గా డిన్నర్ పార్టీ అరేంజ్ చేశాడు.

మెంబర్స్ అతన్ని ఘనంగా మెచ్చుకున్నారు.

'జయపూర్ కి గుడ్ బై' చెప్పారు కిరణ్, విజయ.

మొదటి రాక్షస సంహారం విజయవంతంగా పూర్తయినందుకు విజయకు అంతులేని ఆనందంగా వుంది.

రెండో రాక్షసుడి వేటకు పథకం తయారు చెయ్యాలి.

## 22

పెదవులకు లిప్ స్టిక్ టచప్ చేసింది. తేనెరంగు కూలింగ్ గ్లాసులు తగిలించింది. జుట్టు వెనక్కి మడిచి కట్టింది. ఇప్పుడామె బాబ్డ్ హెయిర్ కటింగ్ చేసుకున్న అమ్మాయిలా కనిపిస్తోంది.

గులాబీ రంగు పంజాబీ డ్రెస్ ఆమెకు అద్భుతంగా సూటయింది. పల్చటి వల్లెవాటు నిర్లక్ష్యంగా రెండు గుండెల మధ్య కదులుతోంది.

ఆమె పంజాబీ అమ్మాయి కాదంటే ఎవరూ నమ్మరు.

'రెబ్ నాయర్' తిరగేస్తున్న కిరణ్ సడన్ గా ఆమెను చూసి కళ్ళు ఆర్పడం మర్చిపోయిన వాడిలా చూస్తుంటే, విజయ వచ్చి అతని ప్రక్కనే కూర్చుంది.

"ఏమిటా చూపు. దిష్టి తగులుతుంది" అంది అతని ముఖాన్ని తిప్పి.

"నీ మేకప్ అద్భుతంగా వుంది. నువ్వు నువ్వని నేనే నమ్మలేకపోయాననుకో. ఎక్కడ నేర్చుకున్నావు? నాటకాలు వేసేదానివా?" అన్నాడు కిరణ్ నవ్వుతూ.

"అంత బాగుందా?" అందామె మందహాసం చేస్తూ.

"మార్వలెస్" అంటూ ఆమె ముఖాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు.

పెదవులకు, పెదవులు కలపబోతుంటే "డోంట్ బీ సిల్లీ. లిప్ స్టిక్ చెరిగిపోతుంది" అంది విజయ.

"ఫర్వాలేదు. మళ్ళీ వేసుకోవచ్చు. ముద్దొచ్చినప్పుడే పెట్టుకోవాలి" అన్నాడు.

విజయ అతన్ని నెట్టి లేచి నిల్చుంది.

"వెళ్ళొస్తాను" అంది హేండ్ బాగ్ తీసుకుని.

"విష్ యూ బెస్టాఫ్ లక్" నవ్వాడు.

విజయ రోడ్డుమీదకు వచ్చింది.

ఆటోలో ఎక్కి కూర్చుని అడ్రెస్ చెప్పింది.

'అడ్వాన్ అడ్వర్టైజర్స్' ఆఫీసుముందు ఆటో దిగింది. ఆఫీసులోకి వెళ్ళి మేనేజర్ రూమ్‌లోకి వెళ్ళింది.

"వెల్ కమ్ మేడమ్" అన్నాడు మేనేజర్ చిరునవ్వుతో.

విజయ కూర్చుంది. హేండ్ బాగ్ లో నుంచి కవరు తీసింది.

"ఈ ఫోటోలో వున్నది మా అంకుల్. చనిపోయాడు.

పేపర్‌లో వేయించాలని వచ్చాను" అన్నది.

అతను కవరు అందుకుని ఫోటో తీసి చూశాడు.

"ఏ పేపర్లో వేయాలంటారు?"

"అన్ని తెలుగు పేపర్లలో" చెప్పింది విజయ.

అతను ఆశ్చర్యంగా చూశాడు.

"చాలా అవుతుంది మేడమ్."

"నో ప్రాబ్లమ్."

"హైదరాబాద్ ఎడిషన్లో వేస్తే సరిపోతుందా?"

"తెలుగు పేపర్లు ఎన్ని ఎడిషన్ వేస్తారు?"

"కొన్ని హైదరాబాద్, విజయవాడ ఎడిషన్స్ వేస్తారు. మరి కొన్ని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి ఎడిషన్స్ వేస్తున్నారు."

"ఐ వాంట్ టూ పబ్లిష్ ఇన్ ఆల్ ఎడిషన్స్" చెప్పింది విజయ.

అతను నోరు తెరిచాడు.

"అన్ని తెలుగు పేపర్లలో కూడానా?"

"యస్."

అతను ఆశ్చర్యంనుంచి కోలుకోడానికి కొంచెం సమయం పట్టింది.

"చెప్పండి ఏ సైజ్ వెయ్యమంటారు?"

"ఈ ఫోటో యే సైజ్‌లో వుంది?"

అతను స్కేల్‌తో కొలతలు వేసి "టెన్ బై ట్వల్వ్ సైజ్ మేడమ్" అన్నాడు.

"అదే సైజ్ వేయించండి."

"అంత సైజ్ అనవసరమేమో మేడమ్?"

"వెయ్యండి. బాగుంటుంది" అందామె.

అతను ఆ పేపర్స్ చూసి కాలిక్యులేటర్ మీద లెక్క-
చేశాడు.

"చెప్పండి ఎంత మీ బిల్?"

అతను చెప్పాడు.

ఆమె హేండ్ బాగ్‌లో నుంచి డబ్బుతీసి ఇచ్చింది.

"మేటర్ చెప్పండి మేడమ్?"

"ఆయన పేరు పశుపతి రాజేంద్రకుమార్."

"బిజినెస్ చెప్పండి."

"చాలా బిజినెస్‌లు వున్నాయి. అవన్నీ అనవసరం. చనిపోయిన డేట్, పుట్టిన రోజు వేయించండి చాలు" అంది విజయ.

"ఈ సంస్మరణ ఎవరు వేయించారని వెయ్యాలి?"

"బంధుమిత్రులు."

"దెన్ ఓ కె" అన్నాడు మేనేజర్.

ఇంటర్ కమ్‌లో ఎకౌంటెంట్‌ని రమ్మని పిలిచాడు.

అతను వచ్చాక డబ్బు అందించి రసీట్ ఇవ్వమన్నాడు.

"మేడమ్ రసీట్ ఎవరి పేరుతో ఇవ్వమంటారు?"

"నా పేరుతో నే. కె.యస్. రాణి" చెప్పింది విజయ.

"ఏ రోజు పేపర్లో రావాలంటారు?"

"ఈ రోజు సోమవారం. శుక్రవారం పేపర్లో వేయించగలరా?"

"నో ప్రాబ్లమ్" చెప్పాడు మేనేజర్.

ఎకౌంటెంట్ రసీట్ బుక్ తెచ్చి మేనేజర్ ముందు పెట్టాడు. అతను సంతకం చేసి ఆమెకు అందించాడు.

డాక్టర్ రాజారాంకి నిద్రలేవగానే పేపరు చూడడం అలవాటు. మెయిన్ హెడ్డింగ్ చూస్తాడు. హాట్ హాట్ న్యూస్ చదివేస్తాడు. హాస్పటల్ కి వెళ్ళేలోపల పేపర్ మొత్తం చదవడానికి వీలుండదు. ఉదయం చూడగా మిగిలింది రాత్రికి చదువుతాడు.

అలవాటు ప్రకారం పేపరు చూస్తూ గావుకేక పెట్టాడు.

'పద్మా' అంటూ.

అతని కేకకు భార్య హడలిపోయి ఏం కొంప మునిగిందో అర్థంకాక కిచెన్ లో నుంచి పరుగెత్తుకు వచ్చింది.

చూసి ఏమీ కాలేదు భర్త నిక్షేపంగా వున్నాడు.

'హమ్మయ్య' అని గుండెలమీద చెయ్యేసుకుని తేలికగా వూపిరి పీల్చుకుంది.

"ఏమిటి అంత గట్టిగా కేకపెట్టారు? హడలిపోయాను. గుండె ఆగిపోయింది" అంది పద్మావతి.

డాక్టర్ రాజారాం మాట్లాడలేదు. ముఖం నల్లబడి పోయి వుంది. పేపరు అదేపనిగా చూస్తున్నాడు.

భర్త మాట్లాడకపోవడంతో ఆమెకు అనుమానం వచ్చింది. పేపర్లో ఏదో దారుణమైన విషయం చూసి అలా అయిపోయాడనుకుంది. రోజూ ఎన్నో యాక్సిడెంట్లు, రేప్ లు, మర్డర్లు జరుగుతుంటాయి. ఎందరో చస్తుంటారు అందులో ఏం విశేషం ఉంటుంది? ఎవరైనా ఈయన అభిమాన నాయకుడుగాని, సినిమా నటుడుగాని హఠాత్తుగా పోయాడా? అలా పోతే రాత్రి టి.వి.లో న్యూస్ ఐటమ్ లో చూపించేవారే?

పద్మావతి భర్త కేకకు కారణం ఏమైవుంటుందో

ఊహించలేక దగ్గరగా వచ్చింది.

"ఏం జరిగింది?" అంది.

అతను మౌనంగా పేపరు ఆమె చేతికి అందించాడు.

"నాన్నా!"

ఆమె కుప్పలా కూలిపోయింది సోఫాలో. వెక్కి వెక్కి ఏడవసాగింది.

రాజారాం ఆమెను వారించలేదు. కొంతసేపు అలా ఏడిస్తే రిలీవ్ కలుగుతుంది ఆమెకు.

తర్వాత ఓదార్చాడు.

"చూడు పద్మా! నాకొక విషయం అర్థంకావడం లేదు. మీ నాన్న చనిపోయింది ఆదివారం ఈ రోజు శుక్రవారం. ఆరు రోజుల తరువాత సంస్మరణ వెయ్యడం తర్వాతే మనం చూశాం. ఇప్పటివరకు ఆయన చనిపోయినట్లు మనకు టెలిగ్రామ్ గాని, ఫోన్ గాని లేదు. అందులోను నువ్వు పెద్ద కూతురువి. ఎందుకు ఫోన్ చేసి తెలియ చేయలేదంటావ్?" అన్నాడు.

పద్మావతి ఏడుస్తూనే అన్నది. "ఇదంతా మావయ్య కుట్ర."

"ఎవరూ?" ఆశ్చర్యపోయాడు.

"దశరథ్ మావయ్య!"

"ఏం? ఆయనెందుకు కుట్ర చేస్తాడు?" రాజారాంకి ఏమీ అర్థంకాలేదు.

"ఎందుకేమిటండీ? నాన్నకి మగపిల్లలు లేరు కదా! ఆస్తి మొత్తం కాజెయ్యాలని కుట్రపన్నుతున్నాడు. మనల్ని దూరంగా వుంచుతున్నాడు. దుర్మార్గుడండీ వాడు. ఎంత దారుణం కాకపోతే! తండ్రి చనిపోతే పిల్లలకు తెలియపరచకుండా దహనం చేస్తాడా?"

పద్మావతి ఏడుస్తూనే మేనమామను నోటికొచ్చినట్లు తిడుతోంది.

రాజారాంకి అసలు సంగతి ఏమీ అర్థంకావడంలేదు.

ఆస్తి సంగతి తర్వాత.

ముందు కట్రెసీ నేక్ పిల్లలకి తెలియబరచి, పిలిపించాలి గదా! లేకపోతే లోకం ఆడిపోసుకోదూ?

అదేమాట భార్యతో అన్నాడు.

పద్మావతి విసుచుకు పడింది.

"దీన్నిబట్టి వాడి కుట్ర తెలియడంలేదా? మనల్ని పిలిపిస్తే ఆస్తి గురించి ఆరాతీస్తామని వాడి భయం. ఈ పాటికి వాడు విల్లు రాయించుకుని వుంటాడు. అంతా కాజేసి వుంటాడు."

"పోతే పోనియ్యి పెధవ ఆస్తి దాన్ని గురించి బాధ లేదు. కడసారి చూపులు దక్కనియ్యకుండా ఎందుకు చేశాడా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు రాజారాం.

పద్మావతికి కాలు చెయ్యి ఆడడంలేదు.

రాజారాం అన్నాడు.

"ఈ ఫోటో చూశావా? ఏదీ దొరకనట్లు ఎప్పటిదో ఇరవై ఏళ్ళనాటిది వుంటుంది. దాన్ని వేయించాడు. నేను మొదట చూసి ఎవరోలే అనుకున్నాను."

"మా నాన్నను చివరి చూపులు దక్కకుండా చేశాడు. వాడు నాశనమైపోతాడు. కుక్క చావు చస్తాడు. మనిషిని పంపించినా గుంటూరు ఎంతసేపట్లో వస్తాడు? సర్కార్ ఎక్కితే తెల్లవారేలోగా దిగేవాడు" పద్మావతి ఏడుస్తూనే అంది.

"ఊరుకో పద్మా! అయిపోయిందానికి ఏం చేస్తాం. ఇప్పుడేం చెయ్యాలో తోచడంలేదు. చెప్పు ఏం చేద్దాం?

మద్రాస్ వెళ్దామా?" అడిగాడు రాజారాం.

"మా చెల్లెలికయినా కబురు చేశావో లేదో? అది వెళ్ళిందో లేదో? నాకేం తోచడంలేదండీ. మీరే యేదైనా చెయ్యండి."

"దగ్గర్లో గుంటూర్లో వున్న నీకే కబురు చెయ్యక పోతే ఎక్కడో ఢిల్లీలో వున్న మీ చెల్లెల్ని పిలిపిస్తా రంటావా?" అన్నాడు రాజారావు.

పద్మావతి ఏడుస్తూనే వుంది.

రాజారాం లేచి "మనం వెళ్తేనే బాగుంటుంది పద్మా! నువ్వు లేచి బట్టలు సర్దుకో. డ్రైవర్‌కి కబురు పెడతాను" అన్నాడు.

## 24

స్రవంతి డ్రెస్సింగ్ చేసుకుంటూ వుండగా కాలింగ్ బెల్ మ్రోగింది. ఆమె అల్లుకుంటున్న జడ వెనక్కి నెట్టి ఆదుర్దాగా తలుపు దగ్గరికెళ్ళింది. రెండు రోజుల తర్వాత డ్యూటీ నుంచి తిరిగివస్తున్నాడు శివరాం. తనని చూస్తూనే అల్లుకుపోతాడు. చేసుకున్న అలంకరణ అంతా వృధా. మళ్ళీ మొదలు పెట్టాల్సిందే.

స్రవంతి హృదయం వుప్పొంగింది శివరాంని తలుచుకోగానే.

తలుపుతీసి చూస్తే నిరాశ కలిగింది.

వచ్చింది శివరాం కాదు. మిసెస్ సురేష్‌కుమార్.

"హాయ్! స్రవంతీ!"

"హాయ్!"

"ఇంకా తయారుకాలేదా?" అంది ఆమె.

"అవుతూ వున్నాను. శివరాం వస్తారేమోనని ఎదురు చూస్తున్నాను. డ్యూటీ దిగివుంటాడు ఈపాటికి."

"మిసెస్ బెనర్జీ ఎదురుచూస్తూ వుంటుందేమో? ముందుగా రమ్మని మరీ మరీ చెప్పింది."

"పార్టీ ఎప్పుడో ఈవెనింగ్ గదా! ఇప్పుడు ఇంకా లెవెన్ కాలేదు."

"మనం క్లోజ్‌గా మూవ్ అయ్యేవాళ్ళం గూడా గెస్టుల్లాగా ఈవెనింగ్ వస్తే బాగుంటుందా? మనకి లంచ్ గూడా అక్కడే ఎరేంజ్ చేస్తున్నానని మరీ మరీ చెప్పింది."

మిసెస్ సురేష్‌కుమార్ చెప్పే మాటలు పరధ్యానంగా వింటూ వుంది స్రవంతి.

ఏ క్షణంలోనయినా శివరాం వస్తాడని ఆమె నమ్మకం.

హాల్లో వున్న ఫోన్ మ్రోగింది.

స్రవంతి మిర్రర్ ముందునుంచి కదల్లేదు.

మిసెస్ సురేష్‌కుమార్ వెళ్ళి రిసీవర్ ఎత్తింది.

"హాలో....హూ ఈజ్ స్పీకింగ్ ప్లీజ్."

"సుచిత్రా బెనర్జీ. ఐ వాంట్ స్రవంతి. మే ఐ నో యువర్ గుడ్ నేమ్ ప్లీజ్."

"నేనే మిసెస్ సురేష్‌కుమార్."

"అక్కడేం చేస్తున్నావు? ఇక్కడ బోర్ కొట్టి చస్తున్నాను. స్రవంతి, నువ్వూ వెంటనే రండి."

"అలాగే.....అలాగే.....! నాదేం ఆలస్యం లేదే బాబూ! స్రవంతి డ్రెసప్ అవుతోంది. మిస్టర్ శివరాం వస్తాడేమోనని ఎదురుచూస్తోంది."

"ఎవరే?" అని కేక పెట్టింది స్రవంతి.

"ఇంకెవరు? సుచిత్ర! ఇంకా రాలేదేమని కంగారు

పడుతోంది" చెప్పింది మిసెస్ సురేష్‌కుమార్.

"దానికి చాల సంబరాకపోతే ఎప్పుడో ఈవెనింగ్ జరిగే పార్టీకి ఇప్పుడే రమ్మని మనల్ని చంపడం దేనికి?"

"లేక లేక కొడుకు పుట్టాడు మరి. పార్టీ హాల్లో ఎరేంజ్‌మెంట్స్ గ్రాండ్‌గా డెకొరేషన్ చేయించాలా లేదా?"

"అదంతా మనం చేసేదే వుంది?"

"కర్రి పెత్తనం."

ఇద్దరూ మాట్లాడుకుంటూ ఉండగా మళ్ళీ టెలిఫోన్ రింగైంది.

"చూడవే బాబూ! మళ్ళీ ఫోన్ చేసిందేమో?" అంది స్రవంతి నవ్వుతూ.

మిర్రర్‌లో తన ప్రతిబింబాన్ని తనివితీరా చూసుకుంటోంది. స్రవంతి చామన ఛాయలో వుంటుంది. ఢిల్లీలో ఆమె ఫ్రెండ్స్ అంతా మంచి రంగులో మిసమిసలాడుతూ ఉంటారు. తను చిలకల్లో కాకిలా ఉంటానేమో అనే ఇన్‌ఫీరియారిటీ లోలోపల బాధిస్తుంటుంది. అందుకే ఆమె మేకప్ మీద ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుంది. రెగ్యులర్‌గా బ్యూటీ క్లినిక్‌కి హాజరవుతుంది. ఆకర్షణీయంగా తయారవడంవల్ల ఆమె రంగు, అందం మరుగున పడిపోతాయని ఆమె నమ్మకం.

"హల్లో.... స్రవంతీ?"

"నో మేడమ్ ఐయామ్ మిసెస్ సురేష్‌కుమార్."

"స్రవంతి లేదా?"

"వుంది. మీరెవరు?"

"నేను స్రవంతి సిస్టర్ని, పద్మావతిని మాట్లాడుతున్నాను గుంటూరు నుంచి."

"ఏమే! మీ సిస్టరి మాట్లాడుతుంది. త్వరగా రా!"

"మా సిస్టరా?" నివ్వెరపోయింది స్రవంతి.

"అవునే. పద్మావతి అట. గుంటూరు నుంచి."

స్రవంతి పరుగుతీసింది.

"హలో! అక్కా! నేను స్రవంతిని మాట్లాడుతున్నాను."

"స్రవంతీ! నేను పద్మని మాట్లాడుతున్నానే."

"గుంటూరు నుంచేనా?"

"అవునే. కొంప మునిగిపోయిందే" పద్మావతి ఏడుపు వినిపించింది. మాటలు ఆగిపోయాయి.

స్రవంతి గుండె ఆగిపోయినట్లయ్యింది.

ముఖం చెమటలు పట్టింది.

"ఏం జరిగిందే అక్కా!"

"నాన్న చచ్చిపోయాడే!" పద్మావతి గొంతు బొంగురుగా వినిపించింది.

"వాట్?" స్రవంతి గట్టిగా కేక పెట్టింది.

"అవునే!"

"ఎప్పుడు?"

"ఆదివారం."

"ఆదివారమా?...." స్రవంతి బిత్తరపోయింది.

"అవునే మావయ్య మనల్ని మోసం చేశాడు."

"ఏమిటక్కా! నువ్వు చెప్పేది నాకేం అర్థంకావడం లేదు. ఆదివారం నాన్న చనిపోవడం ఏమిటి? మావయ్య మోసం చెయ్యడం ఏమిటి? ఈ రోజు శుక్రవారం తెలుసా?"

"అదేనే నేను చెప్పేది. ఆదివారం నాన్న చని

పోయాడు. మావయ్య మనకి తెలియజెయ్యలేదు. ఈ రోజు పేపర్లో సంస్మరణ అని నాన్న ఫోటో వేస్తే చూశాము. నువ్వు పేపరు చూశ్వేదా?"

"లేదు. ఇక్కడ తెలుగు పేపరు దొరకదు."

"సరే! మీరు అట్నుంచి అటు మద్రాస్ వచ్చేయండి. మేము ఒకగంటలో బయల్దేరుతున్నాం. ఏం? వినబడుతోందా?"

"ఆc....ఆc....అసలు ఎలా పోయాడు నాన్న?...."

"ఏమో? ఫోన్ చేస్తే నెంబర్ రెస్పాన్స్ లేదన్నారు. వెళ్ళాక అన్నీ తెలుస్తాయి."

స్రవంతి ఏడుపు ఆపుతూంటూ మాట్లాడుతోంది. తర్వాత లైన్ కట్ అయింది. ఆమె రిసీవర్ క్రేడిల్ చేసి వెక్కి వెక్కి ఏడ్చింది. మిసెస్ సురేష్‌కుమార్ సంగతి తెలుసుకుని ఆమెను ఓదార్చింది.

"ఇప్పుడేం చెయ్యాలో! నాకేం తోచడం లేదు." దీనంగా అంది స్రవంతి.

అప్పటి వరకు ఎంతో వుత్సాహంగా వున్న స్రవంతి నీరుగారిపోయింది. శక్తిలేనిదానిలా సోఫాలో కూలబడి పోయింది. తండ్రి గుర్తొచ్చి వెక్కి వెక్కి ఏడుస్తోంది. శోకమూర్తిలా కనిపిస్తున్న స్రవంతిని చూసి మిసెస్ సురేష్‌కుమార్‌కి జాలి కలిగింది.

"నేను వెంటనే మద్రాస్ వెళ్ళాలి. శివరాం ఎప్పుడొస్తాడో!" ఆవేదనతో అంది స్రవంతి.

"స్రవంతీ ప్లీజ్ రిలాక్స్. శివరాం వచ్చేస్తూంటాడు. కంగారు పడకు."

"ఎయిర్‌పోర్ట్‌కి ఫోన్ చేసి శివరాం వచ్చేదేమో కనుక్కోవే!" స్రవంతి కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది.

మిసెస్ సురేష్‌కుమార్ ఎయిర్‌పోర్ట్‌కి ఫోన్ చేసింది.

"శివరాం డ్యూటీ దిగి రెండుగంటలు దాటిందటే. ఇంకా రాకపోవడం ఏమిటి?" అంది.

అది విని స్రవంతికి ఆవేదన ఎక్కువైంది. ఎంతకీ ఏడుపు ఆపడంలేదు. గంట దాటింది. స్రవంతి ఏడుపు వింటుంటే బాధగా వుంది. యేడ్చేవాళ్ళు ఎంత బాధ అనుభవిస్తారో, అది వింటున్న సన్నిహితులు ఇంకా యెక్కువ వేదన పొందుతారు.

సుచిత్ర మళ్ళీ ఫోన్ చేసింది. స్రవంతి ఫాదర్ పోయాడని తెలిసి బాధ పడింది. శివరాం వస్తే పార్టీకి రమ్మని స్లిప్ రాసి అక్కడికి వచ్చేయమంది. నలుగురిలో వుంటే స్రవంతికి వూరడింపుగా వుంటుందని చెప్పింది. సుచిత్ర సలహా బాగానే వుందనిపించింది.

స్రవంతిని బ్రతిమాలి బయల్దేరదీసింది. శివరాం దగ్గర డూప్లికేట్ కీ వుంటుంది కాబట్టి ఇబ్బంది లేదు. టీపాయ్ మీద స్లిప్ చూసి హోటల్‌కి తప్పకుండా వస్తాడు అని చెప్పి కన్విన్స్ చేసింది మిసెస్ సురేష్‌కుమార్.

మౌర్య హోటల్ పార్టీహాల్ బుక్ చేసింది సుచిత్ర కొడుకు బర్త్‌డేకి. రిసెప్షన్ కౌంటర్ దగ్గర నిలబడి వుంది సుచిత్ర. కారు దిగి వస్తున్న స్రవంతికి ఎదురు వెళ్ళింది. సుచిత్రను చూడగానే స్రవంతికి ఏడుపు ఆగలేదు. వాళ్ళిద్దరూ క్లోజ్ ఫ్రెండ్స్.

స్రవంతిని ఓదారుస్తూ సోఫాలో కూర్చోబెట్టింది సుచిత్ర. ఇద్దరూ మాట్లాడుకుంటూ కూర్చున్నారు. ఇంతలో మిసెస్ సురేష్‌కుమార్ కారు పార్కుచేసి వచ్చింది.

"శివరాం ఇంకా రాలేదే. ఏం చెయ్యాలో తోచడం

లేదు" అంది స్రవంతి.

"శివరాం వచ్చాడు" అంది మిసెస్ సురేష్‌కుమార్.

స్రవంతి వులిక్కి పడింది.

సుచిత్ర ఆశ్చర్యంగా చూసింది.

"ఎక్కడున్నాడు?" అంది సుచిత్ర.

"నేను కారు పార్కు చేస్తుంటే కన్పించాడు టాక్సీలో దిగాడు పోర్టికోలో. ఎవరో ఫ్రెండ్‌తో కలిసి లోపలకు వచ్చాడు. మీరు చూళ్ళేదా?" మిసెస్ సురేష్ కుమార్ ఆశ్చర్యంతో అడిగింది.

"లేదే!" అంది స్రవంతి.

"మీరు చూళ్ళేదు. పోనీ మిమ్మల్ని అతను చూశాడా?"

"ఏమో?" అంది సుచిత్ర.

మిసెస్ సురేష్‌కుమార్ అయోమయంగా చూసింది.

స్రవంతికి అర్థం కావడంలేదు. డ్యూటీ దిగినవాడు ఇంటికి రాకుండా హోటల్‌కి ఎందుకు వచ్చినట్లు? ఆ మాటే ఫ్రెండ్స్‌తో అంది.

"ఫారిన్ నుంచి ఎవరైనా క్లోజ్ ఫ్రెండ్ వచ్చారేమో! అతనితో పాటు వస్తూ ఇక్కడ దిగి వుంటాడు" అంది సుచిత్ర.

"చూద్దాం. వస్తాడేమో?" అంది మిసెస్ సురేష్ కుమార్.

"ఎక్కడున్నాడో చూడవే ప్లీజ్!" అంది స్రవంతి.

ఇంత పెద్ద హోటల్లో అతను యే గదిలో వున్నాడో ఎలా తెలుస్తుంది? ఫారిన్ టూరిస్టులు, బిజినెస్ మాగ్నెట్లు, పాలిటీషియన్స్ ఎందరో వుంటారు. ప్రతి గదికీ ముందు 'DONT DISTURB' అనే కార్డులు తగిలించి

వుంటాయి. మిసెస్ సురేష్‌కుమార్‌కి ఏమీ అర్థం కావడం లేదు.

రిసెప్షన్ కౌంటర్లో అడిగింది ఇప్పుడే లోపలకు వచ్చిన ఇద్దరు ఏరూమ్‌లో వున్నారని. వాళ్ళ ఆనవాళ్ళుగూడా చెప్పింది. వాళ్ళు 'టూ నాట్ త్రీ'లో వున్నారని తెలిసింది.

"శివరాం టూ నాట్ త్రీ లో వున్నాడే" చెప్పింది మిసెస్ సురేష్‌కుమార్.

"ఇంకేం మరి పెళ్ళి విషయం చెబుతాం. వెంటనే మెడ్రాస్ వెళ్లాలి కదా పాపం" అంది సుచిత్ర.

"వస్తాడు కదా! ఇక్కడే కూర్చుందాం" అంది మిసెస్ సురేష్‌కుమార్.

"ఎప్పటికి వస్తాడో? వెంటనే చెప్పే మంచిది. ఇమీడియట్ గా ఏదైనా ఫ్లైట్ వుందేమో?" అంది సుచిత్ర.

మిసెస్ సురేష్ ఎందుకు మౌనంగా వుందో ఇద్దరికీ అర్థం కాలేదు. స్రవంతికి మనసు కలుక్కుమంది.

"సర్లేవే నేనే వెళ్ళి చెప్తాను" అంది స్రవంతి సోఫాలో నుంచి లేచి నిలబడి.

"ఎందుకు నీ వెళ్ళి చెప్తావే!" అంది మిసెస్ సురేష్‌కుమార్. ఆమె గొంతులో ఎందుకో కంగారు ధ్వనించింది.

"ముసుగులో గుద్దులాట ఎందుకు? అందరం వెళ్దాం" అంది సుచిత్ర.

"వెళ్ళడం ఎందుకు ఫోన్ చేసి విషయం చెబుదాం. దిగివస్తాడు. సరిపోతుంది." అంది మిసెస్ సురేష్‌కుమార్.

"ఇంతలోకి మళ్ళీ ఫోన్ ఎందుకు? లిఫ్ట్‌లో ఎంత సేపు వెళ్తాం? సెకండ్ ఫ్లోర్‌లోనే వుంది 'టూ నాట్ త్రీ' అంది సుచిత్ర.

ముగ్గురూ లిఫ్ట్ దగ్గరికి వెళ్ళారు.

సెకండ్ ఫ్లోర్ లో దిగారు.

'టూ నాట్ త్రీ' రూమ్ ముందు 'DONT DISTURB' కార్డు కనిపించింది.

మిసెస్ సురేష్ దిక్కులు చూస్తోంది. స్రవంతి ఏమీ తోచని దానిలా వాళ్ళ ముఖాల్లోకి చూసింది. సుచిత్ర తలుపుమీద చెయ్యి వేసింది.

తలుపులు తెరుచుకోగానే శివరాం ముఖం కనిపించింది. తలుపు తట్టిన వాళ్ళని తిట్టాలనుకున్న అతని నోరు అలా ఆశ్చర్యంతో తెరుచుకుపోయింది. అతను మొలకు చుట్టుకున్న టర్కీటవల్ తప్ప శరీరంమీద ఏ ఆచ్ఛాదనా లేదు.

"మీరు.... మీరు...." అని తత్తరపడ్డాడు. విచిత్ర చూపులు చూశాడు.

సుచిత్ర వెంట అంతా లోపలకు నడిచారు.

బెడ్ మీద వున్న విదేశీ యువతి వాళ్ళని చూసి తన నగ్నశరీరాన్ని కప్పుకోవడానికి బెడ్ షీట్ అందుకుంది.

## 25

రివాల్వింగ్ ఛైర్ లో అసహనంగా కదులుతున్నాడు రాజేంద్రప్రసాద్. ఉదయం ఏడు గంటల నుంచి ఎన్ని ఫోన్ కాల్స్ వస్తున్నాయో లెక్కలేదు ప్రసాద్ ఇండస్ట్రీస్ కి మెడ్రాస్ లో వున్న డిస్ట్రిబ్యూటర్స్, స్టాకిస్టులు, వ్యాపార ప్రముఖులు, ఫ్రెండ్స్ ఫోన్స్ చేసి విసిగిస్తున్నారు. దేశవ్యాప్తంగా వున్న డిస్ట్రిబ్యూటర్స్ ట్రంకాల్స్ చేసి యస్. టి. డి. లోను మాట్లాడుతున్నారు.

'నేను బ్రతికే వున్నాను మొర్రో' అని చెప్తున్నా

నమ్మడం లేదు.

తెల్లవారి రిలీజయిన అన్ని తెలుగు పేపర్లలోను రాజేంద్రప్రసాద్ ఆదివారంనాడు చనిపోయాడని ఫోటోతో సహా బంధుమిత్రుల పేరిట వేసిన ప్రకటన సంచలనం కలిగించింది. ఆషా మాషా ప్రకటనకాదు. పావు పేజీలో ప్రముఖంగా వేశారు. కాదు వేయించారు.

ఎవరు?

వేలు ఖర్చు పెట్టి ప్రకటన వేయించినవారు ఎవరు?

అందువల్ల వాళ్ళకేం లాభం?

రాజేంద్రప్రసాద్ బుర్ర బద్దలై పోతున్నది.

అతనికి భార్య లేదు. ముగ్గురు కూతుర్లు. ఇద్దరికి పెళ్ళయి పోయింది. ఆఖరి అమ్మాయి బి. ఇ. ఎలెక్ట్రానిక్స్ చదువుతోంది. ప్రసాద్ ఇండస్ట్రీస్ తయారుచేసే ఎల క్ట్రానిక్స్‌కి మార్కెట్లో మంచి పేరుంది. ఫ్యాన్స్, కట్టు మిషన్స్, హీటర్స్, మిక్సీలు హాట్ కేక్స్‌లా అమ్ముడవుతున్నాయి. దేశవ్యాప్తంగా డీలర్లున్నారు. విదేశాలకు ఎగుమతులున్నాయి.

తెలిసినంతవరకు శత్రువులుగూడా ఎవరూ లేరు.

తనని అపఖ్యాతి పాలుచెయ్యడానికి ఎవరు చేశారీ పని?

బజ్జర్ నొక్కగానే లోపలకు వచ్చిన అటెండర్ ఖాళీ అయిన గ్లాసులోకి రాయల్ సెల్యూట్ విస్కీ వంపి ఐస్ క్యూబ్స్ వేశాడు. ఖాళీ ప్లేట్లో జీడిపప్పు పోశాడు.

ఫోన్ రింగైంది.

అతను రిసీవర్ ఎత్తి కోపంగా అన్నాడు.

“రీటా! ఎవరితోను మాట్లాడనని చెప్పాను. గుర్తు

లేదా? డోంట్ డిస్టర్బ్ మీ!"

"సరే! ఆంధ్రా హోమ్ మినిస్టర్ ఫోన్ చేశారు. పేపరు ప్రకటన ఫాల్స్ అని చెప్పాను. ఆయన నమ్మడం లేదు. మీతో మాట్లాడాలని పట్టుపడుతున్నారు. మీరు ఆయన బెస్టు ఫ్రెండ్‌నని చెప్తున్నారు" చెప్పింది రీటా.

"వూఁ...." అన్నాడు అయిష్టంగానే.

లైన్‌లోకి వచ్చాడు కౌటిల్యరావు.

"హల్లో! రాజేంద్రప్రసాద్?"

"యస్. స్పీకింగ్."

"నేనురా కౌటిల్యరావుని."

"బాగున్నావా?"

"నా బాగు సరే! పేపర్లో నువ్వు చచ్చిపోయావని వేశారేమిటి? ఎవరు వేశారు? సరదాగా నువ్వే వేయించుకున్నావా?"

"ఏడ్చావ్? ఎవడు వేయించాడో తెలియక నేను చస్తుంటే నేను సరదాగా వేయించుకున్నానంటావేమిటి?"

"లేకపోతే అంత పెద్ద ఫోటో డబ్బిచ్చి మరీ ఎవరు వేస్తారు? నెహ్రూగారు పోయినప్పుడు కూడా పేపరోళ్ళు అంత పెద్ద ఫోటో వెయ్యలేదు."

"నీ జోక్ సరేగాని బాగా సంపాదిస్తున్నావా?"

"నా ముఖం సంపాదన. ఏవూళ్ళో ఎవడు దేన్ని రేప్ చేసినా, ఏపోలీస్ స్టేషన్‌లో లాకప్ మరణం జరిగినా, ఎక్కడ బందిపోట్లు దోచుకున్నా హోమ్‌మినిస్టర్ రాజీనామా చెయ్యాలని గొడవ చేస్తుంటారు అపోజిషన్ వాళ్ళు."

"సొరకాయలు కొయ్యకు. యస్. ఐ.ని వేస్తే

పాతిక వేలు, సి.ఐ.ని ట్రాన్స్ఫర్ చేస్తే ఏభై వేలు సంపాదిస్తున్నావనీ పేపరోళ్ళు తెగరాస్తుంటే రామ....రామ అంటావేమిటి?"

"వాళ్ళేం రాసుకుంటే నాకేం. ఏనుగుపోతుంటే కుక్కలు మొరుగుతాయంట. లెక్క చేసేదెవడుగాని నీ బిజినెస్ బాగుందా?"

"బాగానే వుంది."

"ఆ మధ్య మా వాడికి కోయంబత్తూర్ నుంచి ఏదో సంబంధం వుందని చెప్పావు? మళ్ళీ రాలేదేం? ఏమైంది?"

"నేనా? మీ వాడికి కోయంబత్తూర్‌లో సంబంధం ఉందన్నానా? భలేవాడివిరా?" ఆశ్చర్యపోయాడు రాజేంద్రప్రసాద్.

"నువ్వు హైదరాబాద్ వచ్చినప్పుడు చెప్పావు గదారా? లాడ్జిలో దిగానన్నావు. సాయంకాలం ఆరింటికి వస్తానన్నావు. మళ్ళీ అడ్రస్ లేవు. నాకూ తీరిక లేక తర్వాత ఆ విషయం పట్టించుకోలేదు."

"ఏడ్చినట్టుందిరా? నేను హైదరాబాద్ వచ్చి గెంతేళ్ళయింది. ఆ రాజేంద్రప్రసాద్ ఎవడో? నేను మాత్రం కాదు."

"నువ్వుకాక నన్ను ఒరేయ్ అని పిలిచే రాజేంద్ర ప్రసాద్ ఇంకెవడున్నాడ్రా?"

"ఏమో? నీకే తెలియాలి. హోమ్ మినిష్టర్‌వి గదా! సి. ఐ. డి.లని పంపి ఎంక్వయిరీ చేయించు" నవ్వాడు రాజేంద్రప్రసాద్.

"గమ్మత్తుగా వుందే! అన్నట్లు నీకు తెలుసా? మన వాడు అవతారకృష్ణని ఎవరో మర్డర్ చేశారు?"

"ఊజీట్?"

"అవున్రా! ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. నువ్వు హైదరాబాద్ వచ్చినప్పుడు వాడి అడ్రస్ అడిగావు. నేను తెలియదని చెప్పాను."

"అబ్బా! నేను కాదురా బాబూ! వాడెవడో?"

"ఏమో? నాకు వండర్ గా వుంది ఇదంతా!"

"వాడెక్కడున్నాడు? ఎవరు మర్డర్ చేశారు?"

"జైపూర్‌లో డామ్ కడుతున్నారు తెలుసుగా. అక్కడ వీడు కంట్రాక్టరట. అర్ధరాత్రి ముండ ఇంట్లో ఉండగా యెవరో మర్డర్ చేశారట."

"అయ్యయ్యో?"

"పేపర్లో చూసి స్టన్ అయిపోయాను. మన క్లోజ్ ఫ్రెండ్ వాడు. తలాక దిక్కు అయిపోయాం."

"ఇంతకీ ఎవరు మర్డర్ చేశారు వాడిని?"

"ఇంతవరకు తెలియలేదు."

"ఒరేయ్ చాలా షేమ్‌గా వుందిరా వినడానికి. హోమ్ మినిస్టర్వి ఆమాత్రం తెలుసుకోలేకపోయావా?"

"భలేవాడివే! పేపర్లో చూసి వెంటనే డి.జి.పి.ని పిలిపించి చెప్పాను వెంటనే హంతకుడు ఎవరో పట్టుకోమని. పాపం ఆయనేం చేస్తాడు? ఆ రేంజి డి.ఐ.జి. గట్టిగా చెప్పాడు. స్వయంగా చూడమన్నాడు. యస్.పి. గూడా స్పాట్‌కి వెళ్ళి ఎంక్వయిరీ చేశాడు. కేసు చాలా గమ్మత్తుగా వుంది. ఫాతిమా అని వాడి కీప్. దాన్ని అనుమానించడానికి వీల్లేదట. మనవాడు పోషిస్తున్నాడు. అన్నం పెట్టేవాడిని అది ఎందుకు చంపుతుంది? దాని తమ్ముడిని అనుమానిస్తున్నారు. వాడి కూతురు లవ్ ఎఫైర్‌లో ఒకడిని సస్పెక్ట్ చేస్తున్నారు. వాళ్ళ బావ

మీద గూడా అనుమానం ఉందట."

"అయితే ఈ కేసు తేలేది కాదులే" అన్నాడు రాజేంద్రప్రసాద్.

"ఇంతకీ నువ్వు చచ్చిపోయావని పేపర్లో వేయించింది ఎవరట?"

"మా బామ్మర్ది స్వయంగా తిరుగుతున్నాడు పత్రిక ఆఫీసుల చుట్టూ. కనుక్కుని రాస్తాడు. హైదరాబాద్‌లో నువ్వు గూడా ఎంక్వయిరీ చెయ్యి ప్రకటన మొదట వేళారో తెలుస్తుంది."

"ఓ. కే."

"ఉంటాను. చూసి చాలా రోజులైంది. మద్రాస్ వచ్చినప్పుడు ఇంటికి రా."

"అలాగే. నువ్వు ఇక్కడికి రావడం లేదా?"

"లేదురా! తీరిక ఏది?"

"ఓ.క. గుడ్ బై."

రాజేంద్రప్రసాద్ రిసీవర్ క్రెడిల్ చేసేసరికి ఎదురుగా దశరథ్ కూర్చుని ఉన్నాడు.

"ఏరా! కనుక్కున్నావా?"

"ఆఁ....ప్రకటన ఇచ్చింది ఎవరో అమ్మాయట బావా!"

"అమ్మాయా?" ఆశ్చర్యపోయాడు.

"క. యస్. రాణి. ఆ అమ్మాయి గూడా పత్రికల ఆఫీసు కొచ్చి ఇవ్వలేదట. అడ్వాన్స్ అడ్వర్ టైజర్స ద్వారా ప్రకటన పంపిందట" చెప్పాడు దశరథ్.

"క. యస్. రాణి ఎవత్రా? నాకెవరూ గుర్తురావడం లేదు. నీకేమైనా జ్ఞాపకం వుందా?"

"లేదు బావా!" అన్నాడు దశరథ్.

"వండర్‌ఫుల్‌గా వుందే! నేను చచ్చిపోయానని వేలు ఖర్చుపెట్టి ప్రకటన ఎందుకు ఇచ్చినట్లు? వాళ్ళకేం లాభం? అందులోనూ అమ్మాయి!"

రాజేంద్రప్రసాద్ మత్తు దిగిపోతున్నట్లుగా వుంది. సీసా ఎత్తి గ్లాసు నింపుకున్నాడు.

ఫోన్ మ్రోగింది.

దశరథ్ రిసీవర్ ఎత్తాడు.

"అలాగా! చెప్తాలే" అని ఫోన్ పెట్టేశాడు.

"గుంటూరునుంచి పద్మ వాళ్ళు వచ్చారట" అన్నాడు దశరథ్.

రాజేంద్రప్రసాద్‌కి నవ్వొచ్చింది. తను చచ్చిపోయాడని కూతురూ, అల్లుడు వచ్చారన్నమాట.

"ఇప్పుడేం చేద్దాం?" ప్రశ్నించాడు రాజేంద్రప్రసాద్.

"కౌంటర్ వేద్దాం పేపర్లో."

"ఏమని నేను బ్రతికే వున్నాననా?" నవ్వాడు.

"అవును."

"వెయ్యకపోతేనేం?"

"ఇలాగే ఫోన్లు, కండొలెన్స్ టెలిగ్రామ్స్ వస్తుంటాయి. చుట్టాలు దిగుతూంటారు" అన్నాడు దశరథ్.

"నేను బ్రతికి వుండగా చచ్చానని పేపరు వాళ్ళు వేసినందుకు పరువు నష్టం దావా వెయ్యొచ్చా?"

"ఎవరి మీద?"

"పేపరు వాళ్ళమీద."

"ఎలా? వాళ్ళేం వార్త కాదుగా వేసింది. ప్రకటన. డబ్బిస్తే వేశారు. దానికి వాళ్ళకేం బాధ్యతవుంటుంది?"

"డబ్బిస్తే మాత్రం బ్రతికి వున్నవాళ్ళు, చచ్చారని

యెలా వేస్తారు?" అన్నాడు రాజేంద్రప్రసాద్.

"వాళ్ళకేం తెలుస్తుంది? ఇలా అని వాళ్ళు వూహించ లేరుగా?" అన్నాడు దశరథ్.

"మన లాయర్ని కన్సల్ట్ చెయ్యి. ఏమంటాడో చూద్దాం" అన్నాడు రాజేంద్రప్రసాద్.

దశరథ్ తల వూపి వెళ్ళిపోయాడు.

ఫోన్ రింగైంది.

"సర్! మీ చిన్నల్లుడు ఎయిర్‌పోర్ట్ నుంచి ఫోన్ చేస్తున్నారు. వారికి కారు పంపాలట" చెప్పింది రీటా.

"వెంటనే పంపండి" చెప్పాడు రాజేంద్రప్రసాద్.

అతను తల వెనక్కి వాల్చి కళ్ళు మూసుకున్నాడు. ఉదయం నుంచి అంతా గమ్మత్తుగా వుంది. థ్రిల్లింగ్‌గా కూడా వుంది. యెవరో అమ్మాయి తను చచ్చిపోయినట్లు ప్రకటన ఇవ్వడం ఏమిటి? ఎన్ని వేలు ఖర్చు పెట్టిందో? ఎవరా కె.యస్. రాణి? తన ఫోటో ఆమెకు ఎక్కడ్నుంచి వచ్చింది? అదీ రీసెంట్ ఫోటో కూడా కాదు. ఏనాటిదో?

అతనికి గమ్మత్తయిన ఆలోచన వచ్చింది. అది సినిమా టిక్‌గా వుంది. తను లోగడ యెవర్నయినా పెళ్ళి చేసుకుంటానని మోసం చేశాడా? ఆమెకు ఆడ పిల్ల పుట్టి ఇలా తనమీద పగ తీర్చుకోబోతున్నదా?

ఆలోచిస్తే అతనికి ఎవరూ గుర్తురాలేదు. పగతీర్చుకో వాలనుకుంటే తనను చంపడానికి ప్రయత్నించాలి గాని, ఇలా చచ్చిపోయాడని ప్రకటన ఇస్తే ఏం లాభం? ఎంత అమాయకురాలు?

తన ఆలోచన సిల్లీగా వుందనిపించింది అతనికి. నవ్వు కున్నాడు తనలో తనే.

'పేపర్లో తన ఫోటో చూసి అమ్మాయి లిద్దరూ ఎంత ఏడ్చారో పాపం?' అనుకునే సరికి అతినిగుండె బాధగా మూలిగింది.

తనని చూడాలని ఆదుర్దాపడుతుంటారు. తను చని పోలేదని తెలిసి చాలా సంతోషపడివుంటారు. తన రాక కోసం యెదురుచూస్తూంటారు. వెంటనే ఇంటికి వెళ్ళాలి, అనుకున్నాడు.

కారు రెడీ చెయ్యమని ఇంటర్ కమ్‌లో చెప్పాడు.

ఆఖరి పెగ్ గొంతులో పోసుకుని, సీటులోనుంచి లేచి బయల్దేరాడు.

## 26

శుక్రవారం తెలుగు దినపత్రికలలో నేను చని పోయినట్లుగా ఫొటోతో సహా వేసిన ప్రకటన అబద్ధం. నేను నిక్షేపంగా వున్నాను. యెవరో నా విరోధులు నన్ను అపఖ్యాతి పాలుచెయ్య డానికి వేయించిన ప్రకటన అని బంధు మిత్రు లం దరికీ ఇందుమూలముగా తెలియజేస్తున్నాను. నేను చనిపోయానని పొరబడి స్వయంగాను, ఫోన్ల ద్వారాను, టెలిగ్రామ్స్ యిచ్చి సంతాపం తెలియ జేసిన మా ఖాతాదార్లకు, బంధు మిత్రులకు కృత జ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఇట్లు,

పశుపతి రాజేంద్రప్రసాద్,

ప్రొప్రయిటర్,

ప్రసాద్ ఇండస్ట్రీస్,

యన్. యన్. కృష్ణన్ సాలై, మద్రాసు.

తెలుగు పత్రికలలో వచ్చిన ప్రకటన చదివి విజయ సంతోషించింది.

"కిరణ్! డబ్బుపోతే పోయింది గాని రాజేంద్ర ప్రసాద్ అడ్రస్ దొరికింది" అంది విజయ.

కిరణ్ నవ్వాడు.

"అనవసరంగా డబ్బు ఖర్చుచేశావు విజయా! కాస్త ఆలస్యంగానైనా వాడి అడ్రస్ తెలుసుకునేవాడిని."

"అవతారకృష్ణ అడ్రస్ తెలుసుకోవడానికి నువ్వు పడ్డ తిప్పలు అప్పుడే మర్చిపోయావు."

"అందులోనే వుంది థ్రిల్."

"థ్రిల్ ఏమో గాని టైమ్ వేస్టు కాకూడదని నా వుద్దేశ్యం. చూశావా ఇరవై నాలుగు గంటల్లో వాడు బైటపడిపోయాడు. లేకపోతే యెలా తెలుసుకునే వాడివి? యెన్ని తిప్పలు పడేవాడివి అనవసరంగా."

"ఆ మాట నిజమే."

"ఇప్పుడిక వాడిని పైకి పంపించడానికి ఏ ప్లాన్ వేస్తావో చెయ్యి చూద్దాం" అంది విజయ.

"బేసిక్ ప్లాన్ ఒక్కటే. పోలీసుల్ని తికమక పెట్టడం, వాడు చచ్చేనాటికి ముగ్గురు నలుగురు అనుమానితుల్ని తయారుచెయ్యడం" చెప్పాడు కిరణ్.

"బాగుంది కిరణ్! యెలా వచ్చింది నీకీ ఐడియా?"

"నీ కోసమే నా మనసులో పుట్టుకొచ్చింది."

"  కోసమా?"

"యస్ విజయా! చిన్నతనం నుంచి మనం ఒకటిగా పెరిగాం. మనం పెళ్ళిచేసుకుని సుఖంగా వుంటామని యెన్నో కలలు కన్నాం. కాని యెప్పుడో జరిగిన చేదు

నిజం చెప్పి మా నాన్న నీ మనసులో పగ రగిల్చాడు. ఆ జ్వాలల్లో మాడిపోవడానికి సిద్ధపడ్డావు నువ్వు. నేనీ విషయం విన్నప్పుడు షాక్ తిన్నాను. భరించలేక పోయాను. నువ్వు లేకుండా నేను జీవించడం కల్ల అని పించింది. బ్రతికేది నాలుగు రోజులే అయినా సుఖంగా జీవించాలని అనుకున్నాను. కాని నేరం చేసి బైటపడకుండా వుండడం యెలాగా అని తీవ్రంగా ఆలోచించాను. రోజుల తరబడి మథన పడ్డాను. చివరకు సక్సెస్ అయ్యాను. ఒక రోజు ఈ ఐడియా ఫ్లాష్‌లా మనసులో మెరిసింది" చెప్పాడు కిరణ్.

విజయ అబ్బురంగా చూసింది అతన్ని.

"థాంక్యూ కిరణ్. నువ్వు తోడుగా నిలబట్టి నేనిలా నిశ్చింతగా వున్నాను" అంది విజయ మెచ్చుకోలుగా.

కిరణ్ ఆప్యాయంగా చూశాడు.

"చెప్పు కిరణ్! మద్రాస్ ఎప్పుడు బయల్దేరదాం?"

"నీ ఇష్టం విజయా!"

"ఈవెనింగ్ ఫ్లైట్‌లో ఖాళీలున్నాయేమో ఎంక్వయిరీ చెయ్యనా?"

"వద్దు విజయా! ట్రైన్‌లో చూడు."

"ఏం? విమానం అంటే భయమా?"

"అది కాదు. అంత అర్జెంట్‌గా వెళ్ళాల్సిన అవసరం ఏముంది? నెమ్మదిగా ట్రైన్‌లో వెళ్దాం. అనవసరంగా డబ్బు దండగ."

"హాయిగా గంటలో వెళ్ళిపోవచ్చు. డబ్బు దండగ ఏముంది?"

"అవసరం వచ్చినప్పుడు ఎంతయినా ఖర్చు పెట్టు. అనవసరంగా ఒక్క రూపాయిగూడా ఖర్చుపెట్టగూడదు

విజయా! రాత్రికి వెళ్ళే బదులు రేపు ఉదయం చేరుకుంటాం. దానికి వెయ్యిరూపాయలు ఖర్చుపెట్టడం అవసరం కాదా!"

"అబ్బా! అబ్బాయిగారు చాలా పొదుపు నేర్చుకున్నారే!" వ్యంగ్యంగా నవ్వింది విజయ.

"ట్రైన్ పొదుపు, సుఖం కూడా. బెర్తుమీద పడుకుంటే రైలు ఉయ్యాలలా ఊగుతూ హాయిగా నిద్ర పడుతుంది."

"అవును ఉయ్యాల ఊగి యెన్నాళ్ళో అయింది గదూ!"

"ఎప్పుడో అట్లతద్దినాడు ఊగినట్లు గుర్తు" నవ్వాడు కిరణ్.

"త్వరగా డ్రెస్ చేసుకో. సికింద్రాబాద్ వెళ్దాం."

"ఎందుకు?!

"ఎందుకేమిటి? రిజర్వేషన్ కోసం. లేకపోతే జనరల్ కంపార్టుమెంట్ లో వెళ్దామా?"

"నేను రెడీ" అన్నాడు కిరణ్.

విజయ అతని రెక్కపట్టుకుని సోఫాలో నుంచి లేవదీసింది. మర్నాడు ఉదయం మద్రాస్ చేరుకున్నారు. టి.నగర్ గిరి రోడ్ లో విజయ వాళ్ళకి రెండంతస్తుల బిల్డింగ్ వుంది. వెయ్యిగజాల ప్లాట్ చుట్టూ ప్రహరీ గోడ మధ్యలో బిల్డింగ్. మామిడి, నిమ్మ, నారింజ చెట్లు, రకరకాల పూల మొక్కలతో పచ్చగా ఉంటుంది. విజయ వాళ్ళ తాతగారు కట్టించారు. భవానీ నిలయం అని పేరు కనిపిస్తూ ఉంటుంది. ఎందరు అద్దెకు అడిగినా భవానీదేవి ఒప్పుకోలేదు. ఔట్ హౌస్ లో తిమ్మయ్య ఉంటున్నాడు. అతనే ఆ ఇంటికి వాచ్ మాన్, తోట

మాలి కూడా.

పదిగంటలకు కిరణ్ తయారైపోయాడు. తెల్లటి బట్టల్లో వాషింగ్ సోప్ అడ్వర్‌టైజ్‌మెంట్ మోడల్‌లా కనిపిస్తున్నాడు. అతని చేతిలో బ్లూ కలర్ ఫైలుంది. అందులో అతని డిగ్రీ సర్టిఫికెట్లు, యన్.సి.సి., స్పోర్ట్సు సర్టిఫికెట్సు వగైరా వున్నాయి.

విజయ బాత్‌రూమ్‌లో నుంచి వచ్చి అతను రెడీ అయిపోవడం చూసి కొంచెం ఆశ్చర్యపోయింది.

"కిరణ్! అప్పుడే ఎక్కడికి?"

"వేటకి."

"ఏ వేట?"

"మద్రాస్ మహానగరంలో ఎలా బ్రతకాలి మేడమ్! ఏదో ఒక నౌకరీ వెతుక్కోవద్దూ! ఒంటరి వాడిని కూడా కాదు."

"జోక్స్ తర్వాత."

"జోక్ కాదు నిజం. కావాలంటే ఇదుగో ఫైల్ చూడు."

ఫైల్ విజయకు అందించాడు.

విజయ ఫైల్ తిరగేసి తిరిగి ఇచ్చేసింది.

"ఇక్కడెవరున్నారు మీ తాత నౌకరీ ఇవ్వడానికి?"

"వెతకడానికేగా బయల్దేరింది."

"ఎలా వెళ్తావ్? స్కూటర్ కూడా తెచ్చుకో లేదుగా?"

"నిరుద్యోగి స్కూటర్ మీద తిరిగితే ఉద్యోగం యెవరిస్తారు?"

"అయితే"

"బస్సే గతి."

విజయ నవ్వింది.

కిరణ్ ఫైల్ చేత్తో పట్టుకుని బయల్దేరాడు. గిరి రోడ్‌కి ఒకవైపు పాండీబజార్, రెండోవైపు రాఘవయ్య రోడ్డు వున్నాయి. ప్రసాద్ ఇండస్ట్రీకి వెళ్ళడానికి దారి విజయను అడిగి తెలుసుకున్నాడు. పాండీబజార్లో బస్ స్టాప్ దగ్గర నిల్చున్నాడు. పన్నెండు 'బి' ఎక్కి రామ్ థియేటర్ దగ్గర దిగాలి. అక్కడికి దగ్గర్లోనే ఉంటుంది ప్రసాద్ ఇండస్ట్రీస్.

పదిగంటలకు ఫుల్ రష్‌గా వుంటాయి సిటీబస్‌లు. పన్నెండు 'బి' మరీను. వస్తున్నాయి, పోతున్నాయి. క్రిక్కిరిసిన పాసింజర్స్‌తో పోతున్న బస్సులు చూస్తూ నిల్చున్నాడు. అరగంట గడిచింది. ఎంతసేపు నిల్చున్నా తనకోసం బస్సులు ఖాళీగా రావని అర్థమైంది. ఒక బస్ రాగానే ఎక్కాడు. లోపల ఉక్కపోత. కండక్టర్ బస్ మధ్యలో జనం మధ్య చిక్కుకుపోయాడు.

'మున్నాడీ పాంగో'

'మున్నాడీ పాంగో'

కేకలు పెడుతున్నాడు. ఎవరూ వినిపించుకోవడం లేదు. అతనికి బి.పి. రెయిజైపోయి అరుస్తున్నాడు. రామ్ థియేటర్ వచ్చేవరకు కిరణ్‌కి టిక్కెట్ తీసుకోవడం కుదర్లేదు. బస్ దిగేసి క్రింద నుంచి కండక్టర్ని కేకేసి రూపాయి కాయిన్ చేతిలో పెట్టాడు.

బస్ కదిలింది.

'ఎన్నంగో' అని కండక్టర్ కేకేస్తున్నా వినిపించుకోకుండా ముందుకు సాగాడు కిరణ్.

కోడంబాకంలో మెయిన్‌రోడ్డుమీదే వుంది ప్రసాద్ ఇండస్ట్రీస్. బిల్డింగ్‌పైన నియాన్ లైటుమీద ఇంగ్లీషు

అక్షరాలు కలిపిరాతలో వున్నాయి. రాత్రిపూట అవి వెలిగితే ప్రకాశవంతంగా కనిపిస్తాయి.

గేటుముందు స్టూలుమీద కూర్చుని వున్నాడు గూర్ఖా వాచ్ మాన్. కిరణ్ అతన్ని గమనించనట్లు సరాసరి లోపలకు వెళ్ళిపోయాడు. వాచ్ మాన్ అడ్డు చెప్పలేదు. ఫస్టుక్లాస్ పర్సనాలిటీతో దూసుకుపోతున్న అతన్ని ఆపడానికి వాచ్ మాన్ కి ధైర్యం చాలలేదు ఎందుకో.

ఆఫీసులో ఎవరి పనిలో వాళ్ళున్నారు. కిరణ్ ని ఎవరూ పట్టించుకోలేదు.

తెల్లటి యూనిఫాంలో వున్న అటెండర్ని అడిగాడు కిరణ్.

"మేనేజర్ గారు ఎక్కడుంటారు?"

అటెండర్ చెప్పాడు.

'వి. వెంకటసుబ్బయ్య, మేనేజర్' అని తలుపుమీద బోర్డు వేలాడుతోంది.

అటెండర్ ద్వారా స్లిప్ మీద తన పేరు రాసి పంపాడు.

కిరణ్, ఎమ్.కామ్.

అటెండర్ తిరిగివచ్చి లోపలకు రమ్మన్నాడు.

"గుడ్ మార్నింగ్ సర్" అన్నాడు కిరణ్.

వెంకటసుబ్బయ్య గుమ్మడికాయలా వున్నాడు. బొద్దుగా ఎర్రటి శరీరం. బట్టతలచుట్టూ తెల్లటి వెంట్రుకలున్నాయి. ముఖానికి విభూతి రేఖలు అడ్డంగావున్నాయి. అరవాయనేమో అనుకున్నాడు.

"ప్లీజ్ బీ సీటెడ్" అన్నాడు.

థాంక్స్ చెప్పి కూర్చున్నాడు కిరణ్.

"నా పేరు కిరణ్. ఎమ్.కామ్. ప్యాసయ్యాను. మీ

ఇండస్ట్రీలో ఎక్కౌంట్స్ వింగ్ లో యేదైనా జాబ్ దొరుకుతుందేమోనని వచ్చాను" ఇంగ్లీషులో చెప్పాడు.

"అబ్బాయ్ నువ్వు తెలుగువాడివేనా?"

"అరే ఎలా తెలుసుకున్నారు?"

"నీ ముఖంచూసి తెలుసుకున్నాలే" చనువుగా అన్నాడు వెంకటసుబ్బయ్య.

"మీరూ తెలుగువారేనా? అడ్డబొట్టు చూసి అరవ వాళ్ళు అనుకున్నాను" అన్నాడు కిరణ్.

"అరవవాళ్ళల్లో కలిసిపోయాం. మా అబ్బాయి పేరు శివరామన్, అమ్మాయి శ్రీవల్లి. ఎక్కడుంటే అక్కడ మిక్సయిపోవాలి."

"మీరు చెప్పింది సెంట్ పర్సెంట్ కరెక్టు."

"ఇప్పుడు చెప్పు? ఏం కావాలన్నావ్ జాబ్ కదూ!"

"అవున్సార్. మనం మనం ఒకటి. మీరెలాగైనా జాబ్ ఇప్పించాలి."

"మాడబ్బాయ్! నువ్వు తెలుగువాడివైపోవడం నీ దురదృష్టం. ఇక్కడ తెలుగువాళ్ళని పనిలో చేర్చుకోరు" చెప్పాడు వెంకటసుబ్బయ్య.

"మీరు తెలుగువాళ్ళేగదా సార్!"

"ఎప్పుడో పాతకాలంలో తీసుకున్నవాళ్ళం కొందరం ఉన్నాంలే."

"అదేంసార్? ఈ కంపెనీ ప్రొప్రయిటర్ అరవ మనిషా?"

"లేదు. తెలుగువాడే."

"నిజంగా!"

"అక్షరాలా! పదహారణాల తెలుగువాడు. పేరు పశుపతి రాజేంద్రప్రసాద్."

"ఏదేం అన్యాయం సార్! తెలుగువాడి కంపెనీలో తెలుగువాడిని పనిలోకి తీసుకోరా?"

"అదంతే. తెలుగువాళ్ళు పోకిల్లారాయుళ్ళు. పని ఇచ్చినా ఎగ్గొట్టి స్టూడియోల చుట్టూ తిరుగుతుంటారు సినిమాల్లో వేషాలకోసం. ఎప్పుడూ సెలవులు పెట్టి కంపెనీకి ఎగనామం పెడుతుంటారు."

"అన్యాయం సార్! అందరూ అలా వుండరు."

"ఇది నా ఉద్దేశ్యంకాదు నాయనా. మా ప్రొప్రయిటర్ ఉవాచ. అందుకే ఈ కంపెనీలో అంతా అరవవాళ్ళు పనిచేస్తున్నారు. వాళ్ళు కష్టజీవులు. పని మీద శ్రద్ధ వున్న వాళ్ళు. తెలిసిందా!"

"మీరు చెప్పింది గుర్రం, గాడిద ఒకటే అన్నట్లుంది."

"ఏం చేస్తాం. మా ప్రొప్రయిటర్‌కి తెలుగువాళ్ళ మీద బాడ్ ఇంప్రెషన్ పడిపోయింది."

"నాకో సందేహం సార్!"

"ఏమిటి నాయనా?"

"మీ ప్రొప్రయిటర్‌కి కూతుళ్ళున్నారా?"

"ముగ్గురూ కూతుళ్ళే. కొడుకులేడు."

"ఎవరికైనా పెళ్ళిళ్ళు అయ్యాయా?"

"ఇద్దరికి పెళ్ళిళ్ళు చేశాడు."

"వాళ్ళు.........ఐ మీన్ అల్లుళ్ళు తెలుగువారేనా? అరవవాళ్ళా?"

"తెలుగువాళ్ళే."

"అంటే అసమర్థులకిచ్చి పెళ్ళిళ్ళు చేశాడన్నమాట."

కిరణ్ మాటలకు వెంకటసుబ్బయ్య గట్టిగా నవ్వాడు.

"భలేవాడివయ్యా!"

"లేకపోతే యేమిటి సార్ మీరు చెప్పేది. తెలుగు వాళ్ళంతా సినిమాపిచ్చోళ్ళు అయినట్టు చెప్తున్నారు"

అటెండర్ లోపలకు వచ్చి ఫైల్స్ ట్రేలో పడేసి పోయాడు.

"చెప్పండి సార్! ఏమైనా వేకన్సీలున్నాయా?" అడిగాడు కిరణ్.

"చూద్దాం. ఇప్పుడు కాస్త బిజీలో ఉన్నాను. రెండు రోజులు ఆగి కనిపించు" అన్నాడు వెంకటసుబ్బయ్య.

"థాంక్యూ వెరీమచ్ సార్!" అన్నాడు కిరణ్ సంతోషంతో.

ఆటో యెక్కి గిరి రోడ్డులో ఇంటికి వెళ్ళిపోయాడు. మళ్ళీ సాయంకాలం దాటిన తర్వాత కోడంబాకం వెళ్ళాడు. ప్రసాద్ ఇండస్ట్రీస్ ఆఫీసు యెదురుగా ఉన్న హోటల్లో కూర్చున్నాడు. ఆరుగంటలకు బైటకు వచ్చాడు వెంకటసుబ్బయ్య. బస్ స్టాప్ వైపు వస్తుంటే కిరణ్ ఆయన్ని అనుసరించాడు.

"గుడ్ ఈవెనింగ్ సార్!"

వెంకటసుబ్బయ్య వెనక్కి తిరిగిచూసి ఆశ్చర్యపోతూ "నువ్వా!" అన్నాడు.

"నేనే సార్! మీతో కాసేపు మాట్లాడాల వచ్చాను."

"జాబ్ విషయమేగా! చూద్దాం."

"ఫరవాలేదు సార్! అలా చోళా హోటల్లో కూర్చుని మాట్లాడుకుందాం. ప్లెజెంట్ గా వుంటుంది."

చోళా హోటల్ పేరు చెప్పగానే వెంకటసుబ్బయ్య ముఖం ప్రసన్నంగా కనిపించింది.

"ఎందుకయ్యా! అంత దూరం. మరీ కాస్ట్లీ హోటల్

గూడాను" అన్నాడు మొహమాటపడుతూ.

"ఫరవాలేదు పదండి" అని కిరణ్ ఆటో పిలిచాడు.

ఆటో ఆగింది.

ఇద్దరూ ఎక్కి కూర్చున్నారు.

"చోళా" చెప్పాడు కిరణ్.

## 27

వారం తర్వాత కిరణ్ అసిస్టెంట్ స్టోర్ కీపర్ గా డెయిలీ వేజెస్ మీద ప్రసాద్ ఇండస్ట్రీస్ లో జాబ్ సంపాదించాడు. ఆ సందర్భంగా చోళాలో పార్టీ ఇస్తానంటే వెంకటసుబ్బయ్య వద్దన్నాడు. నీ కొచ్చే నెల జీతం ఒక పూటలో హారతి కర్పూరమైపోవడం నా కిష్టం లేదు. చీప్ అండ్ బెస్టు హోటల్ కి వెళ్దాం అని మౌంట్ రోడ్ లో వున్న గజేంద్రవిలాస్ కి తీసుకెళ్ళాడు వెంకటసుబ్బయ్య. ఆ హోటల్ యెప్పుడూ రష్ గా వుంటుంది. ఇడ్లీ, దోసె వంటివే కాకుండా నాన్ వెజ్ బిర్యానీ, చికెన్ సిక్స్టీఫైవ్ వంటివి గూడా దొరుకుతాయి. కావాలనుకున్నవాళ్ళకి గజేంద్ర వైన్స్ నుంచి మందు తెప్పించి ఇస్తారు కస్టమర్స్ కి.

వెంకటసుబ్బయ్య ఇష్టప్రకారమే అప్పుడప్పుడూ గజేంద్రవిలాస్ కి ఇద్దరూ వెళ్ళి కాలక్షేపం చెయ్యడం మామూలయింది. త్వరలోనే అతనికి అతి ఇష్టుడై పోయాడు కిరణ్. వెంకటసుబ్బయ్య పేరుకే మేనేజర్ గాని పవర్స్ అన్నీ దశరథ్ వే. అతను రాజాగారి బావమరిది ఆ కంపెలో బిజినెస్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ మేనేజర్, సేల్స్ మేనేజర్ వంటి కేటగిరీలలో వెంకటసుబ్బయ్య ఒకడు. అతను ఎకౌంట్స్ సెక్షన్ చూస్తుంటాడు.

రాజేంద్రప్రసాద్, అతని ఇండస్ట్రీ గురించి తెలుసుకున్న విషయాలు యెప్పటికప్పుడు విజయకి చెప్తూ వుంటాడు కిరణ్. నెల రోజుల తర్వాత చాలా సమాచారం చేరింది.

రాజేంద్రప్రసాద్‌కి ముగ్గురు కూతుర్లు. ఇద్దరికి పెళ్ళయింది. మూడో అమ్మాయి బి. ఇ. ఎలక్ట్రానిక్స్ చదువుతోంది. అతని భార్య చనిపోయింది. బావమ్మరిది దశరథ్ తిరుగులేని అధికారం చలాయిస్తుంటాడు. అతనే జనరల్ మేనేజర్.

ప్రసాద్ ఇండస్ట్రీస్ కాకుండా 'ఫిలిప్స్' అనే హోటల్ కూడా వుంది అతనికి. ఒక ఫారినర్ అమ్మేస్తుంటే కొన్నాడు. క్యాబరే డ్యాన్సులకు నగరంలో 'ఫిలిప్స్'కి మంచి పేరుంది.

అతను డబ్బు దగ్గర చాలా పీనాసితనంగా ప్రవర్తిస్తుంటాడు. భార్య పోయిన తర్వాత అతను డబ్బు గుంజుతారనే కారణంగానే యే ఆడదాన్నీ చేరదీయలేదు. 'ఫిలిప్స్' పుణ్యమా అని అతనికి ఆ అవసరం లేకుండా పోయింది. ఎందరో క్యాబరే డ్యాన్సర్స్ వస్తూ, పోతూ వుంటారు. అతనికి నచ్చిన అమ్మాయితో సరదాగా కాలక్షేపం చేస్తూ డబ్బు ఇవ్వకుండా సుఖాన్ని జుర్రుకుంటాడు. యజమానికి ఆమాత్రం కన్సెషన్ ఇవ్వడానికి యెవరికీ సామాన్యంగా అభ్యంతరం వుండదు. ఆ ఫీల్డ్ అటువంటిది.

రాజేంద్రప్రసాద్‌ని కాటు వెయ్యడం, తప్పించుకోవడం అంత తేలికైన విషయం అని అనిపించడంలేదు కిరణ్‌కి. అయినా కాలమే తన సమస్యకు పరిష్కారం చూపిస్తుందనే నమ్మకంతో వున్నాడు.

ఆ రోజు సాయంకాలం నాలుగున్నరయింది.

కిరణ్ బస్ కోసం రాక్సిథియేటర్ స్టేజి దగ్గర నిలుచున్నాడు. ట్వెల్వ్ 'బి' బస్సులు క్రిక్కిరిసిపోతున్నాయి. రష్‌గా వున్న బస్సుల్లో ప్రయాణం చెయ్యడానికి అలవాటు పడుతున్నా ఇంకా ఇబ్బందిగానే ఫీలవుతున్నాడు మరి ఫుట్‌బోర్డు మీద నిలబడి పోవడం అతనికి ఇష్టం వుండదు.

"ఒరేయ్ కిరణ్."

కిరణ్ తలెత్తి చూశాడు.

అతడు శ్రీనాథ్. చాలా కాలం తర్వాత కలుసుకున్నానన్న ఆనందం అతనిలో తొణికిసలాడుతోంది.

"ఏరా శ్రీనాథ్! నువ్వా? ఇక్కడ...." కిరణ్‌కి సంతోషంతో మాటలు రావడంలేదు.

ఇద్దరూ విజయవాడ లయోలా కాలేజీలో చదువుకున్నారు. హాస్టల్ రూమ్‌మేట్స్. రెండు సంవత్సరాలు కలిసివున్నారు. తర్వాత శ్రీనాథ్ ఇంజనీరింగు చదవడానికి వరంగల్ వెళ్ళిపోయాడు. కిరణ్ బి. కామ్‌లో చేరాడు. మళ్ళీ ఇప్పుడే కలవడం.

"నువ్వెందుకు వున్నావిక్కడ?" ఆశ్చర్యంగా అడిగాడు శ్రీనాథ్.

"ముందు నీ సంగతి చెప్పు?" అన్నాడు కిరణ్.

"ఏవుంది? ఉద్యోగానికి వేట" అన్నాడు శ్రీనాథ్.

"నేనూ అంతే. ప్రస్తుతానికి చిన్న జాబ్ సంపాదించాను. అదుగో అందులోనే."

ప్రసాద్ ఇండస్ట్రీస్ వైపు చెయ్యెత్తి చూపించాడు.

"సమ్‌థింగ్ ఈజ్ బెటర్ దెన్ నథింగ్" నవ్వాడు శ్రీనాథ్.

"చాలాకాలం తర్వాత కలుసుకున్నాం. పద మెరీనా బీచ్‌కి వెళ్ళి మాట్లాడుకుందాం" అన్నాడు కిరణ్.

శ్రీనాథ్ తల వూపాడు.

ఇద్దరూ ఆటో యెక్కారు.

బీచ్‌లో కూర్చుని చాలాసేపు మాట్లాడుకున్నారు. చిన్ననాటి సంగతులు ముచ్చటించుకున్నారు. కిరణ్ తన గురించి అసలు విషయాలు ఏమీ చెప్పలేదు. పెళ్ళ యిందని మాత్రం చెప్పాడు.

శ్రీనాథ్ మెకానికల్ ఇంజనీర్. అతని స్వతంత్ర వ్యక్తిత్వంవల్ల యే కంపెనీలోను ఇమడలేకపోతున్నాడు. పోనీ స్వయంగా యేదైనా ఇండస్ట్రీ స్టార్టు చేద్దామన్నా పెట్టుబడిలేదు. ఉమ్మడి కుటుంబంలో అతని చదువు కోసం అయిన ఖర్చు విషయంలో చాలా గొడవలు జరిగాయి. వాటాలు పంచిన తర్వాత పొలం అమ్మి వేశాడు శ్రీనాథ్. ఇప్పుడు కేవలం స్వశక్తి మీదనే బ్రతకాలి.

"అయితే నువ్వు జాబ్‌కి పనికిరావురా!" అన్నాడు కిరణ్ అతను చెప్పిన కథంతా విని.

"నేనూ అదే నిశ్చయానికి వచ్చాను" అన్నాడు శ్రీనాథ్.

"ఈ రోజుల్లో స్ట్రెయిట్ ఫార్వర్డ్ పనికిరాదు. లోకం మోసంతో నిండిపోయింది. మోసగాళ్ళకే రోజులు" అన్నాడు కిరణ్.

"జీవితంమీద విసుగుపుట్టి పోనీ మోసం చేద్దామన్నా వీలుకుదరడంలేదు నాకు" అని నవ్వాడు శ్రీనాథ్.

"నువ్వు ఎడ్జెస్టు అయిపోతానంటే, నేనో చిన్న ఉపాయం చెప్తాను. దెబ్బతో పెద్ద ఇండస్ట్రీయలిస్టువి

అయిపోతావు" చెప్పాడు కిరణ్.

శ్రీనాథ్ ఆశ్చర్యంగా చూశాడు.

"ఏమిట్రా అది? దెబ్బతో జాతకం మారిపోయే ఉపాయం?"

"నీకు ధైర్యం ఉంటే చెప్పు. అంతా నేను చూసు కుంటాను."

"ఏమిటో చెప్పు?"

"వివరాలన్నీ తర్వాత. ఏం లేదు. చిన్న అబద్ధం ఆడితే చాలు. ఆ తర్వాత జరిగేవన్నీ నేను చూసు కుంటాను."

"చిన్న అబద్ధం అయితే ఓ. కే." అన్నాడు శ్రీనాథ్.

"అంతేరా బాబు. నువ్వు మర్డర్ని చెయ్యనక్కర్లేదు. దోపిడీలు అంతకంటే చెయ్యక్కర్లేదు."

"అయితే సరే!" అన్నాడు శ్రీనాథ్.

"రేపు సాయంకాలం ఆరుగంటలకు చోళా హోటల్ గేటు దగ్గర రెడీగా వుండు" చెప్పాడు కిరణ్.

"ఎందుకు?"

"వెధవ ప్రశ్నలు వెయ్యకు. చూస్తూ వుండు. నేను చెప్పేవాటికి 'తందాన' అంటూ ఉండడమే నీ పని" అన్నాడు కిరణ్.

శ్రీనాథ్ తల ఊపాడు.

మర్నాడు సాయంకాలం కిరణ్ ఆటో దిగేసరికి చోళా హోటల్ దగ్గర రెడీగా నిల్చుని ఉన్నాడు శ్రీనాథ్

కిరణ్‌తో పాటు వెంకటసుబ్బయ్య దిగాడు.

(ఇంకా వుంది)